జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

NIZAMABAD EDITION

నిజామాబాద్ | శనివారం 25 జూలై 2026 | సంపుటి : 16 | సంచిక : 173 | పేజీలు : 8 | వెల : 1/- | RNI No. TELTEL/2010/35558

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.
అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు
9440231967, 7989694528

శ్రీ పరాభవ నామ సంవత్సరం, ఆషాఢ మాసం, గ్రీష్మ ఋతువు, దక్షిణాయణం విశేషం: తొలి ఏకాదశి, తొలుతేరుపు అదనథ సూర్యోదయం: 5:37 । సూర్యాస్తమయం: 6:30 చంద్రోదయం: 3:15 । చంద్రాస్తమయం: 2:35 తిథి: శుద్ధ ఏకాదశి ఉ. 11:41 వరకు, తదుపరి ద్వాదశి నక్షత్రం: అనురాధ ఉ. 5:54 వరకు, తదుపరి జ్యేష్ఠ యోగం: బ్రహ్మం రా. 11:04 వరకు, తదుపరి ఇంద్రం కరణం: భద్ర ఉ. 11:41 వరకు, తదుపరి బవ రా. 12:40 వరకు, తదుపరి బాలువ

Published from : NIZAMABAD, WARANGAL, RANGAREDDY, KAMMAM, NALAGONDA http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

# వన మహోత్సవం విజయం

**4 వేల ఈత మొక్కల నాటకం**

**పర్యావరణ పరిరక్షణతో పాటు గీత కార్మికుల జీవనోపాధికి ఈత, తాటి మొక్కలు ఎంతో ఉపయోగకరం**

**జిల్లా ప్రొహిబిషన్ �& ఎక్సైజ్ అధికారి ముకుంద్ రెడ్డి**

**ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా భారీ ఎత్తున మొక్కల నాటకం**

**ప్రజాప్రతినిధులు, అధికారులు, గౌడ సంఘం నాయకులు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొనడంతో విజయవంతమైన కార్యక్రమం**



## నకిలీ పత్రాలతో భూమి అక్రమ రిజిస్ట్రేషన్ కేసు ఛేదన

**దేవునిపల్లి పోలీసుల చాకచక్యంతో ముగ్గురు నిందితుల అరెస్ట్**

**అసలు యజమాని స్థానంలో వేరే వ్యక్తిని నిలబెట్టి రిజిస్ట్రేషన్**

**కీలక పత్రాలు స్వాధీనం**



**కామారెడ్డి ప్రతినిధి, జూలై 24 (ప్రజా జ్యోతి)**

కామారెడ్డి జిల్లా దేవునిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన భూమి అక్రమ రిజిస్ట్రేషన్ కేసును పోలీసులు విజయవంతంగా ఛేదించి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. నకిలీ పత్రాలు సృష్టించి, అసలు యజమాని స్థానంలో వేరే వ్యక్తిని నిలబెట్టి భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించిన ఈ ఘటన జిల్లాలో సంచలనంగా మారింది. పోలీసుల వివరాల ప్రకారం, దేవునిపల్లి పోలీస్ స్టేషన్‌లో క్రైం నం.316/2025గా నమోదైన కేసులో భూమిని అక్రమంగా కబ్జా చేసి తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్ చేయించినట్లు ఫిర్యాదు అందడంతో పోలీసులు కేసు నమోదు చేసి లోతుగా దర్యాప్తు చేపట్టారు. - మిగతా2లో

## భూంపల్లి జెడ్పీ హైస్కూల్‌కు ప్రహరీ గోడ లేక అవస్థలు

**రెండేళ్లుగా కూలిన గోడను పట్టించుకోని అధికారులు**

**రాత్రిపూట అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా పాఠశాల**

**విద్యార్థుల భద్రతపై గ్రామస్తుల ఆందోళన**



**కామారెడ్డిప్రతినిధి జూలై 24 (ప్రజాజ్యోతి)**

కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలంలోని భూంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జెడ్పీహెచ్ఎస్) రెండు సంవత్సరాలుగా ప్రహరీ గోడ లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. పాఠశాల ప్రహరీ గోడ కూలిపోయి చాలా కాలం గడిచినా విద్యాశాఖ ఉన్నతాధికారులు, సంబంధిత ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంపై గ్రామస్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ల ప్రహరీ గోడ లేకపోవడంతో పాఠశాల ఆవరణలోకి పశువులు, కుక్కలు, విషపురుగులు నిర్బంధం లేకుండా ప్రవేశిస్తున్నాయి. దీంతో విద్యార్థుల భద్రత ప్రశ్నార్థకంగా మారడమే కాకుండా పాఠశాల పరిశుభ్రత కూడా దెబ్బతింటోంది. ముఖ్యంగా వర్షాకాలంలో పాములు, తేళ్లు వంటి విషజంతువులు పాఠశాల ప్రాంగణంలోకి వచ్చే ప్రమాదం ఉందని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా రాత్రి వేళల్లో పాఠశాల ఆవరణ అసాంఘిక కార్యకలాపాలకు - మిగతా2లో

## మిషన్ భగీరథ నీటి ట్యాంక్ కింద మురుగు నీరు..

## ఇబ్బందులు పడుతున్న గ్రామ ప్రజలు

**దోంగ్లి మండలం ప్రతినిధి జూలై 24 (ప్రజాజ్యోతి)**

కామారెడ్డి జిల్లా దోంగ్లి మండలం లింబూర్ గ్రామంలో మిషన్ భగీరథ నీటి ట్యాంక్ కింద గత కొన్ని ఏళ్లుగా మురుగు డ్రైనేజీ నీళ్లు నిల్వ ఉండటంతో ప్రజలు తాగే నీటిలో కలుషితం అవుతున్నాయి.ట్యాంక్ కింద మురుగు నిలిచి ఉండటంతో గ్రామప్రజలు కుసరఫరా అయ్యే నీరు కలుషితం అవుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మురుగుతో కలిసిన నీటిని తాగలేక, వాడుకోలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అపరిశుభ్రశీ నీరు తాగడం వల్ల అనారోగ్యాల బారిన పడుతున్నామని ఆవేదన చెందుతున్నారు. అధికారులకు చెప్పినా పట్టింపు లేదు.. ఈ విషయాన్ని పలుమార్లు పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సర్పంచ్ కు సమాచారం ఇచ్చినా, గ్రామ సభసమావేశం సందర్భంగా పర్యవేక్షించి సమస్యను గాలికి వదిలేశారని వాపోతున్నారు.ట్యాంక్ కింద ఉన్న మురుగును తొలగించి, తాగునీటిని శుద్ధి చేసి సరఫరా చేయాలని గ్రామప్రజలు కోరుతున్నారు.లేదంటే రోగాల పాలాయే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు.





# తిర్మన్ పల్లిలో తహసీల్దార్ కనుసన్నల్లోనే అక్రమ ఇసుక డంపింగ్!

## అధికారుల తీరుపై నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్థుల తీవ్ర ఆగ్రహం





**ఇందల్వాయి, జులై 24,( ప్రజా జ్యోతి ):** ఇందల్వాయి మండల పరిధిలోని తిర్మన్ పల్లి గ్రామంలో అక్రమ ఇసుక దందా మూడే పువ్వులు, ఆరు కాయలుగా విరాజిల్లుతోంది. స్థానిక తహసీల్దార్ మరియు సంబంధిత అధికారుల కనుసన్నల్లోనే గ్రామ సరిహద్దుల్లో భారీగా అక్రమ ఇసుక డంప్‌లు వెలుస్తున్నాయని తిర్మన్ పల్లి గ్రామస్థులు తీవ్ర స్థాయిలో ఆరోపిస్తున్నారు. కళ్లముందే టన్నుల కొద్దీ ఇసుకను అక్రమంగా తోడేసి నిల్వ చేస్తున్నా, అధికారులు మాత్రం ఏమీ తెలియనట్లు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోంది. సమీప వాగులు, కాలువల నుంచి రాత్రి వేళల్లో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తోడేసి, తిర్మన్ పల్లి పరిసర ప్రాంతాల్లోని ఖాళీ స్థలాల్లో డంప్‌లుగా మారుస్తున్నారు. ఈ అక్రమ రవాణా కారణంగా గ్రామీణ రోడ్లు పూర్తిగా ధ్వంసమై గుంతలమయంగా మారాయి. ఫలితంగా నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని, మరోవైపు భూగర్భ జలాలు అట్టడుగుకు పడిపోయి పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ అక్రమ డంపింగ్‌పై స్థానికులు పలుమార్లు రెవెన్యూ, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, తిర్మన్ పల్లిలో క్షేత్రస్థాయిలో విచారణ జరిపి అక్రమ ఇసుక డంప్‌లను సీజ్ చేయాలని, ఇందుకు సహకరిస్తున్న అధికారులతో పాటు బాధ్యులైన ఇసుక మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

# ప్రతి ఇంటికి రెండు మొక్కలు.. .

## .సాటాపూర్ లో హరితహారం కార్యక్రమం.







**రెంజల్,జూలై 24(ప్రజాజ్యోతి ):** రెంజల్ మండలం లోని సాటాపూర్ గ్రామంలో హరితహారం కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ సర్పంచుల ఫోరమ్ మండలధ్యక్షులు లచ్చావార్ సుహాసినినితిన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీ ఆవరణలో మొక్కలు నాటి గ్రామంలోని ప్రతి కుటుంబానికి రెండు మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రతి ఇంటి వద్ద తప్పనిసరిగా రెండు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులకు చెట్ల సంఖ్య తగ్గిపోవడమే ప్రధాన కారణమని పేర్కొన్నారు. పచ్చదనం పెంపొందించడం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడటంతో పాటు భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు. “ఒక్కో ఇల్లు -- రెండు మొక్కలు, పచ్చని గ్రామం -మనందరి లక్ష్యం” అనే నినాదంతో గ్రామ ప్రజలందరూ హరితహారం కార్యక్రమంలో చురుకుగా పాల్గొని మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఆయన పిలుపునిచ్చారు. గ్రామ ప్రజలు కూడా హరితహారం కార్యక్రమానికి విశేష స్పందన చూపి మొక్కలను స్వీకరించారు. గ్రామాన్ని పచ్చదనంతో నింపేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కల సంరక్షణ చేపట్టాలని సర్పంచ్ సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబెర్స్ దెబ్బ డ రాజు, గంగాధర్, అశోక్, సాబీత్,గౌసియా బేగం, పంచాయతీ కార్యదర్శి రాంరెడ్డి, పంచాయతీ సిబ్బంది,మహిళా సంఘాల సభ్యులు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ సిబ్బంది, యువకులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కామారెడ్డి మండలంలో విద్యాసంస్థల బంద్ సంపూర్ణం

**కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి**

**ఎన్‌టీఏను రద్దు చేయాలని బీడీఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కర్ డిమాండ్**




**కామారెడ్డి ప్రతినిధి , జూలై 24 (ప్రజాజ్యోతి):** భారత్ డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ (బీడీఎస్ఎఫ్) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన విద్యాసంస్థల బంద్‌కు కామారెడ్డి మండలంలో ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు సంపూర్ణంగా సహకరించాయని బీడీఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కర్ తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసే విధంగా జాతీయ స్థాయిలో నిర్వహించిన ప్రవేశ, నియామక పరీక్షల్లో చోటుచేసుకున్న పేపర్ లీకేజీలు, పరీక్షల నిర్వహణలో జరిగిన అవకతవకలు, నిర్వాహక వైఫల్యాలను నిరసిస్తూ ఈ బంద్‌కు పిలుపునిచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు ఎంతో కష్టపడి పరీక్షలకు సిద్ధమవుతున్నప్పటికీ, పరీక్షల నిర్వహణలో జరుగుతున్న నిర్లక్ష్యం, అవినీతి, పారదర్శకత లోపం వల్ల వారి భవిష్యత్తు ప్రమాదంలో పడుతోందని భాస్కర్ ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా వ్యవస్థపై విద్యార్థులు, తల్లిదండ్రులు నమ్మకం కోల్పోయే పరిస్థితులు ఏర్పడటం అత్యంత దురదృష్టకరమని అన్నారు. పరీక్షల నిర్వహణలో వరుసగా చోటుచేసుకుంటున్న పేపర్ లీకేజీలు, అవకతవకలకు కేంద్ర విద్యాశాఖ నైతిక బాధ్యత వహించాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధ్యులందరిపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. జాతీయ పరీక్షల నిర్వహణ సంస్థ (ఎన్‌టీఏ) పూర్తిగా విఫలమైందని, ఈ సంస్థపై దేశవ్యాప్తంగా విద్యార్థుల్లో విశ్వాసం కోల్పోయిందని పేర్కొన్నారు. అందువల్ల ఎన్‌టీఏను వెంటనే రద్దు చేసి, స్వతంత్ర, పారదర్శక, జవాబుదారీతనం కలిగిన కొత్త పరీక్షల వ్యవస్థను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పరీక్షల నిర్వహణలో ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ కట్టుదిట్టమైన భద్రతా చర్యలు అమలు చేయాలని సూచించారు. నిరసన కార్యక్రమాల సందర్భంగా పలు ప్రాంతాల్లో విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడాన్ని బీడీఎస్ఎఫ్ తీవ్రంగా ఖండిస్తోందని భాస్కర్ తెలిపారు. ప్రజాస్వామ్య బద్ధంగా తమ సమస్యలను వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై బలప్రయోగం చేయడం రాజ్యాంగ విరుద్ధమని, ఇది ప్రజాస్వామ్య విలువలకు విఘాతం కలిగించే చర్య అని విమర్శించారు. విద్యార్థుల గొంతును అణచివేయడం కాకుండా వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ముందుకు రావాలని కోరారు. రాష్ట్ర కమిటీ ఇచ్చిన బంద్ పిలుపుకు కామారెడ్డి మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు విశేషంగా సహకరించాయని ఆయన తెలిపారు. విద్యార్థులు, యువజన సంఘాలు, ప్రజాసంఘాలు, ప్రజలు స్వచ్ఛందంగా బంద్‌కు మద్దతు తెలిపారని పేర్కొన్నారు. ఈ విజయవంతమైన బంద్ విద్యార్థి లోకంలో పెరుగుతున్న అసంతృప్తికి నిదర్శనమని అన్నారు. విద్యా వ్యవస్థలో పారదర్శకత, నాణ్యత, జవాబుదారీతనం నెలకొనే వరకు బీడీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఉద్యమాలు కొనసాగుతాయని భాస్కర్ స్పష్టం చేశారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా మరింత ఉధృతమైన ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ పోరాటంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజాసంఘాలు, ప్రజలు అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

# ఇందల్వాయి ప్రభుత్వ ఆసుపత్రిలో కేటీఆర్ జన్మదినం సందర్భంగా పండ్ల పంపిణీ



**ఇందల్వాయి( ప్రజా జ్యోతి)** ఇందల్వాయి, జూలై 24: మాజీ మంత్రి కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఇందల్వాయి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సిలువరి దాస్, రాష్ట్ర నాయకులు పాశం కుమార్, చింతల దాస్ ఆధ్వర్యం కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించిన నాయకులు వారికి పండ్లు అందజేసి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. సమాజ సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని వారు పేర్కొన్నారు. కేటీఆర్ జన్మదినాన్ని సేవా కార్యక్రమాలతో నిర్వహించడం సంతోషకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు లావణ్య అనిల్ బీరీష్ మిట్టపల్లి దాస్ రాములు నామాల గంగాధర్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు నాయకులు, కార్యకర్తలు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లారెడ్డిపల్లె జిల్లా ప్రజా పరిషత్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసిన తహసీల్దార్ బాలయ్య



**ఇందల్వాయి ( ప్రజా జ్యోతి ) జులై 24** ఇందల్వాయి మండల కేంద్రంలోని ఎల్లారెడ్డిపల్లె జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో తహసీల్దార్ బాలయ్య మధ్యాహ్న భోజన పథకాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యత, పరిశుభ్రత, వంటశాల నిర్వహణను పరిశీలించారు. అనంతరం గుడ్లు సరఫరా చేస్తున్న వ్యక్తితో మాట్లాడిన తహసీల్దార్, విద్యార్థులకు ఎల్లప్పుడూ నాణ్యమైన గుడ్లనే సరఫరా చేయాలని సూచించారు. పిల్లల ఆరోగ్య విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని హెచ్చరించారు. తహసీల్దార్ బాలయ్య గ్రామ సర్పంచ్‌తో కలిసి విద్యార్థులతో పాటు కూర్చొని మధ్యాహ్న భోజనం చేశారు. భోజనం రుచి, నాణ్యతపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకం ద్వారా విద్యార్థులకు పోషకాహారం అందేలా అధికారులు, సంబంధిత సిబ్బంది నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఈ తనిఖీతో పాఠశాల సిబ్బంది, వంట కార్మికులు ఆహార నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలను మరింత కట్టుదిట్టంగా పాటించాలని తహసీల్దార్ ఆదేశించారు.

# మల్లాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను తనిఖీ చేసిన తహసీల్దార్ బాలయ్య



**ఇందల్వాయి ( ప్రజా జ్యోతి ) జులై. 24** ఇందల్వాయి మండలంలోని మల్లాపూర్ గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను తహసీల్దార్ బాలయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇళ్ల నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించి, నిర్మాణానికి అవసరమైన ఇసుక పరిమాణాన్ని అంచనా వేశారు. అనంతరం తహసీల్దార్ బాలయ్య మాట్లాడుతూ, ఇందిరమ్మ గృహాలు పేద ప్రజల సొంతింటి కలను సాకారం చేసే ప్రతిష్ఠాత్మక పథకమని అన్నారు. లబ్ధిదారులు నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ ఇళ్ల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసుకునేలా సంబంధిత అధికారులు అవసరమైన సహకారం అందించాలని సూచించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ లహరి, గ్రామ సర్పంచ్ మోహన్‌తో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.ఖ

# రాఘవపూర్‌లో వన మహోత్సవం విజయం





**కామారెడ్డి ప్రతినిధి, జూలై 24 (ప్రజా జ్యోతి)** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా కామారెడ్డి జిల్లా ప్రొహిబిషన్ ఢ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో రాఘవపూర్ గ్రామంలో గురువారం భారీ ఎత్తున 4 వేల ఈత మొక్కలను నాటారు. జిల్లా ప్రొహిబిషన్ ఢ ఎక్సైజ్ అధికారి శ్రీ ముకుంద్ రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమం పర్యావరణ పరిరక్షణతో పాటు గీత కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఆదర్శవంతంగా సాగింది. కార్యక్రమంలో కామారెడ్డి సొసైటీ నెం.1 గ్రూపు ఆధ్వర్యంలో 2 వేల ఈత మొక్కలు, సొసైటీ నెం.2 గ్రూపు ఆధ్వర్యంలో మరో 2 వేల ఈత మొక్కలు నాటడం జరిగింది. గ్రామ పరిసర ప్రాంతాల్లో అనుకూలమైన స్థలాలను ఎంపిక చేసి మొక్కలను శాస్త్రీయ పద్ధతిలో నాటించారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించేలా ప్రత్యేక ప్రణాళికను కూడా రూపొందించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రొహిబిషన్ ఢ ఎక్సైజ్ అధికారి ముకుంద్ రెడ్డి మాట్లాడుతూ, వాతావరణ మార్పులు, పెరుగుతున్న కాలుష్యాన్ని తగ్గించడంలో మొక్కల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. మొక్కలు నాటడం ఒక్కరోజు కార్యక్రమంగా కాకుండా, వాటిని సంరక్షించి పెద్ద చెట్లుగా తీర్చిదిద్దడమే అసలు లక్ష్యమని పేర్కొన్నారు. నేటి తరానికి మాత్రమే కాకుండా భావితరాలకు కూడా స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కల పెంపకాన్ని సామాజిక బాధ్యతగా స్వీకరించాలని పిలుపునిచ్చారు. ప్రత్యేకంగా ఈత, తాటి మొక్కలు పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో కీలక పాత్ర పోషించడమే కాకుండా, వేలాది మంది గీత కార్మికులకు ఉపాధి, ఆదాయ వనరుగా నిలుస్తాయని ఆయన తెలిపారు. ప్రభుత్వం గీత కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉందని, ఈత మొక్కల పెంపకం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని అన్నారు. కామారెడ్డి ఏపీవో అన్నపూర్ణ మాట్లాడుతూ, ప్రభుత్వం నాటిన ప్రతి మొక్క సంరక్షణ కోసం ఒక్కో మొక్కకు రూ.5 చొప్పున ప్రోత్సాహకాన్ని అందజేస్తోందని తెలిపారు. మొక్కలు నాటడమే కాకుండా వాటికి నీరు పోయడం, కంచెలు ఏర్పాటు చేయడం, పశువుల నుంచి రక్షించడం వంటి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల భాగస్వామ్యంతోనే వన మహోత్సవం విజయవంతమవుతుందని ఆమె పేర్కొన్నారు. గ్రామ సర్పంచ్ వినీల నరేష్ మాట్లాడుతూ, గ్రామాన్ని పచ్చదనంతో నింపేందుకు గ్రామపంచాయతీ తరఫున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ప్రతి మొక్కను కాపాడే బాధ్యత గ్రామస్థులందరిదేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ ఏఈఎస్ అరుణ్ చంద్ర, ఎక్సైజ్ సీఐలు సంపత్ కృష్ణ, సుందల్ సింగ్, ఎస్సైలు విక్రమ్ కుమార్, శ్రీనివాస్, రచన, గ్రామ పంచాయతీ కార్యదర్శి మాధవీలత, గౌడ సంఘం అధ్యక్షులు రామచందర్ గౌడ్, జీవన్ గౌడ్, చంద్ర గౌడ్, నారా గౌడ్, గోపి గౌడ్, శ్రీధర్ గౌడ్, రమేష్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, హెడ్ కానిస్టేబుళ్లు జాన్, ఫరీద్, కానిస్టేబుళ్లు మునావర్ గోరి, పవన్, బాబు, శరత్, దినేష్, అమృత్ రెడ్డి, రాజు, శంకర్, వందన, శిరీష తదితర ఎక్సైజ్ శాఖ సిబ్బంది, గౌడ సంఘం సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, ప్రజాప్రతినిధులు పాల్గొని మొక్కలు నాటారు. కార్యక్రమం అనంతరం నాటిన మొక్కల సంరక్షణకు అవసరమైన చర్యలపై అధికారులు అవగాహన కల్పించారు. గ్రామ ప్రజలు ప్రతి మొక్కను దత్తత తీసుకుని సంరక్షించాలని పిలుపునిచ్చారు. పచ్చని తెలంగాణ నిర్మాణంలో ప్రతి గ్రామం భాగస్వామి కావాలని, ప్రకృతి పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని వక్తలు స్పష్టం చేశారు.

రాఘవపూర్‌లో ఒకే రోజు 4 వేల ఈత మొక్కలను నాటడం ద్వారా పర్యావరణ పరిరక్షణ, గీత కార్మికుల సంక్షేమం, గ్రామీణాభివృద్ధి అనే మూడు లక్ష్యాలను ఒకే వేదికపై ముందుకు తీసుకెళ్లడం విశేషంగా నిలిచిందని స్థానికులు అభిప్రాయపడ్డారు.

## కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా
# ఆగస్టు 10న 'జైల్ భరో' విజయవంతం చేయాలి

క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో దేశవ్యాప్తంగా ఉద్యమాలకు పిలుపు

జిల్లా సదస్సులో సీఐటీయూ, రైతు, వ్యవసాయ కార్మిక, గిరిజన, వృత్తిదారుల సంఘాల నాయకుల పిలుపు



**కామారెడ్డి, ప్రతినిధి జూలై 24 (ప్రజా జ్యోతి)** కేంద్ర బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక, గిరిజన, వృత్తిదారుల ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఆగస్టు 10న నిర్వహించే దేశవ్యాప్త 'జైల్ భరో' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, వృత్తిదారుల సంఘం, గిరిజన సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. గురువారం కామారెడ్డి పట్టణంలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఈ సంఘాల ఆధ్వర్యంలో జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొత్త నరసింహులు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మోహన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలను తీవ్రంగా విమర్శించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక వర్గం ఎన్నో దశాబ్దాల పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మిక హక్కులను నిర్వీర్యం చేస్తూ లేబర్ కోడ్స్‌ను అమలు చేస్తోందని ఆరోపించారు. కార్మికులకు కనీస వేతనాలపై స్పష్టత లేకుండా, పని గంటలను పెంచడం, ఉద్యోగ భద్రతను బలహీనపరచడం, ఈపీఎఫ్, ఈఎస్ఐ వంటి సంక్షేమ పథకాలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. లేబర్ కోడ్స్ కార్మికుల హక్కులకు ఉరితాళ్లుగా మారాయని పేర్కొన్నారు. వ్యవసాయ రంగంపై కూడా కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. విదేశీ దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవడం, దిగుమతులపై సుంకాలు తగ్గించడం వల్ల దేశీయ వ్యవసాయ ఉత్పత్తుల ధరలు పడిపోతున్నాయని, ముఖ్యంగా పత్తిపై దిగుమతులు పెరగడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ద్వారా గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించాల్సిన కేంద్ర ప్రభుత్వం, ఈ పథకాన్ని బలహీనపరిచే చర్యలు చేపడుతోందని విమర్శించారు. పథకానికి కేటాయింపులు పెంచాల్సిన సమయంలో కేంద్రం బాధ్యతను రాష్ట్రాలపై మోపే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకోవాలంటే ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అలాగే విద్యుత్ సవరణ చట్టం ద్వారా విద్యుత్ రంగాన్ని క్రమంగా ప్రైవేటీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. స్మార్ట్ మీటర్లు, ముందస్తు చార్జీలు, ఉచిత విద్యుత్ రద్దు వంటి చర్యలు రైతులు, సామాన్య ప్రజలపై అదనపు భారం మోపుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో వ్యవసాయ మోటార్లకు మీటర్లు, అదనపు చార్జీలు విధించే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

దేశవ్యాప్తంగా చేపట్టనున్న ఉద్యమాల్లో భాగంగా ఆగస్టు 10న నిర్వహించే జైల్ భరో కార్యక్రమాన్ని కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, గిరిజనులు, వృత్తిదారులు, ప్రజాసంఘాల కార్యకర్తలు పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బి. వెంకటి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి దశరథ్, సీఐటీయూ జిల్లా నాయకులు రాజనర్సు, పట్టణ నాయకులు నర్సింగరావు, ప్రభు, సంతు, దీవెన, శివ, రాజవ్వ, ఇందిరా, ఏ. రాజు, సంతోష్, అబ్బాస్, కృష్ణ, సాయి తదితరులు పాల్గొన్నారు.

# భూంపల్లి జెడ్పీ హైస్కూల్‌కు ప్రహరీ గోడ లేక అవస్థలు

-మొదటిపేజీ తరువాయి

అడ్డాగా మారుతోందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ ఆస్తులకు నష్టం వాటిల్లే అవకాశం ఉండటంతో పాటు విద్యార్థులకు అనుకూలంగా ఉండాల్సిన విద్యాలయ వాతావరణం దెబ్బతింటోందని వారు పేర్కొంటున్నారు.

పాఠశాల అభివృద్ధిలో భాగంగా కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసి విద్యార్థుల్లో ప్రకృతి పట్ల అవగాహన పెంపొందించాలని ఉపాధ్యాయులు భావించినప్పటికీ, ప్రహరీ గోడ లేకపోవడంతో పశువులు మొక్కలను మేస్తాయనే భయంతో ఆ ప్రయత్నాన్ని విరమించుకోవాల్సి వచ్చిందని తెలిపారు. పాఠశాలలో ఇప్పటికే నాటిన మొక్కలను సంరక్షించడం కూడా కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గ్రామంలో వందలాది మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్న ఈ ప్రభుత్వ పాఠశాల గతంలో 100 శాతం ఉత్తీర్ణత సాధించి మంచి గుర్తింపు తెచ్చుకుంది. అయినప్పటికీ కనీస భద్రత కల్పించే ప్రహరీ గోడ లేకపోవడం విచారకరమని గ్రామ పెద్దలు పేర్కొన్నారు. పాఠశాల చుట్టూ రక్షణ లేకపోవడంతో బయట శబ్దాలు తరగతులకు అంతరాయం కలిగిస్తున్నాయని, విద్యార్థుల ఏకాగ్రతపై కూడా ప్రభావం పడే అవకాశముందని అభిప్రాయపడుతున్నారు.




ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, మౌలిక సదుపాయాల కల్పనపై తరచూ హామీలు ఇస్తున్న ప్రజాప్రతినిధులు భూంపల్లి జెడ్పీ హైస్కూల్ సమస్యను కూడా అత్యవసరంగా పరిగణించి వెంటనే నిధులు మంజూరు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ప్రహరీ గోడ నిర్మాణాన్ని యుద్ధప్రాతిపదికన చేపట్టి విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, పాఠశాల అభివృద్ధి పనులు ఆలస్యం కాకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని, విద్యాశాఖ అధికారులను విజ్ఞప్తి చేశారు.

భవిష్యత్ తరాలను తీర్చిదిద్దే ప్రభుత్వ పాఠశాలకు కనీస రక్షణ కూడా లేకపోవడం బాధాకరమని, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ప్రహరీ గోడ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని గ్రామ ప్రజలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఏకగ్రీవంగా కోరుతున్నారు.

## కళ్యాణ లక్ష్మి చెక్కు అందజేత



**ఇందల్వాయి( ప్రజా జ్యోతి) జులై 24** ఇందల్వాయి మండల కేంద్రంలోని గండి తండ గ్రామపంచాయతీ పరిధికి చెందిన లకావత్ లత (భర్త: రమేష్)కు మంజూరైన కళ్యాణ లక్ష్మి పథకం చెక్కును డిప్యూటీ తహసీల్దార్ మేడం ఆధ్వర్యంలో కాంట్రాక్టర్ మోతిలాల్ నాయక్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని లబ్ధిదారురాలికి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రయోజనాలు అందేలా కృషి చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, గ్రామ పెద్దలు, అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

## కేటీఆర్ జన్మదినం సందర్భంగా రక్తదానం చేసిన బిఆర్ఎస్ కార్యకర్తలు కనిగిరి విఠల్, అజీమ్



**బీర్కూర్ (ప్రజాజ్యోతి) జూలై 24:** బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన రక్తదాన కార్యక్రమంలో కనిగిరి విఠల్, షేక్ అజీమ్ స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ రైతు సమన్వయ జిల్లా అధ్యక్షుడు అంజి రెడ్డి, దామరంచ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఆదాం పటేల్, అంజయ్య, వార్డు సభ్యులు సాయిలు, షేక్ అబ్దుల్, ఆంజనేయులు, మేతరి శంకర్ తదితరులు పాల్గొని రక్తదాతలను అభినందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రక్తదానం మహాదానం అని, ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసి ప్రాణాలను కాపాడే మహోన్నత సేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## నకిలీ పత్రాలతో భూమి అక్రమ రిజిస్ట్రేషన్ కేసు ఛేదన




-మొదటిపేజీ తరువాయి

విచారణలో దేవునిపల్లి వార్డు పరిధిలోని కాకతీయ నగర్ కాలనీ, సర్వే నెం.210/1లో గల ప్లాట్ నెం.71 అసలు యజమాని ముక్తవరం వెంకటయ్య పేరుపై ఉండగా, రాజంపేట మండలం ఆర్గొండ గ్రామానికి చెందిన బండారి శ్రీనివాస్ రెడ్డి తనపై ఉన్న అప్పులు తీర్చుకోవాలనే ఉద్దేశంతో ఆ స్థలాన్ని అక్రమంగా విక్రయించేందుకు కుట్ర పన్నినట్లు తేలింది. ఈ కుట్రలో భాగంగా తన భార్య బండారి సునీతను కొనుగోలుదారుగా చూపించి, తాడ్వాయి మండలం ఎంద్రియాల్ గ్రామానికి చెందిన తన మామ సంగారెడ్డిని అసలు యజమాని ముక్తవరం వెంకటయ్యగా సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో హాజరుపరిచి, నకిలీ గుర్తింపు పత్రాలు, తప్పుడు ఆధారాలతో అక్రమంగా భూమి రిజిస్ట్రేషన్ చేయించినట్లు పోలీసులు గుర్తించారు. అంతటితో ఆగకుండా, అసలు విషయాన్ని దాచిపెట్టి అదే స్థలాన్ని ఇతరులకు విక్రయించినట్లు, అనంతరం ఆ స్థలం పలువురి పేర్లపై వరుసగా రిజిస్ట్రేషన్ అయినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ప్రధాన నిందితుడు బండారి శ్రీనివాస్ రెడ్డి విచారణలో తన నేరాన్ని అంగీకరించాడని పోలీసులు తెలిపారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు బండారి శ్రీనివాస్ రెడ్డి, అతని భార్య బండారి సునీత, సంగారెడ్డిలను పోలీసులు అరెస్ట్ చేసి న్యాయస్థానం ముందు హాజరుపరిచారు. కేసుకు సంబంధించిన కీలక పత్రాలను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా కామారెడ్డి జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, భూముల కొనుగోలు సమయంలో యాజమాన్య హక్కులు, గత రిజిస్ట్రేషన్ చరిత్ర, రెవెన్యూ రికార్డులు, సంబంధిత పత్రాలను పూర్తిగా పరిశీలించిన తర్వాతే కొనుగోలు చేయాలని ప్రజలకు సూచించారు. నకిలీ పత్రాలు సృష్టించడం, అసలు యజమాని స్థానంలో వేరే వ్యక్తిని చూపించి రిజిస్ట్రేషన్ చేయించడం, ప్రజలను మోసం చేయడం వంటి నేరాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో భూముల అక్రమ రిజిస్ట్రేషన్లపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి, ఇలాంటి మోసాలకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించే చర్యలు కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కేసు ఛేదనతో భూముల కొనుగోలు, విక్రయాల్లో మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని పోలీసులు మరోసారి ప్రజలకు గుర్తు చేశారు.

## కోటాలపల్లిలో మురికి కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణానికి

# ఎమ్మెల్యే నిధులు మంజూరు చేయాలి

**ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేసిన సర్పంచ్ ఆకుల శ్యాం కుమార్**



**కామారెడ్డి ప్రతినిధి, జూలై 24 (ప్రజాజ్యోతి)** కామారెడ్డి మండలం కోటాలపల్లి గ్రామంలో మురికి కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే నిధుల నుంచి వెంటనే నిధులు మంజూరు చేయాలని కోరుతూ గ్రామ సర్పంచ్ ఆకుల శ్యాం కుమార్ ఈరోజు కామారెడ్డి శాసనసభ్యులు కాటిపల్లి వెంకటరమణ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి, అత్యవసరంగా అభివృద్ధి పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఆకుల శ్యాం కుమార్ మాట్లాడుతూ, కోటాలపల్లి గ్రామపంచాయతీ ఏర్పడి ఎనిమిదేళ్లు పూర్తి అయ్యాయి తెలిపారు. ముఖ్యంగా మురికి కాలువలు లేకపోవడంతో ఇళ్ల ముందు, వీధుల్లో మురుగు నీరు నిలిచిపోతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారిందని, మురుగు నీరు నిల్వ ఉండటంతో దుర్వాసన వ్యాపించడంతో పాటు దోమలు విపరీతంగా పెరిగి ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారాయని వివరించారు. చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని, అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం కూడా ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో గ్రామంలో 600 మీటర్ల మురికి కాలువ నిర్మాణంతో పాటు 500 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే నిధుల నుంచి వెంటనే పరిపాలనా అనుమతులు (సాంక్షన్) మంజూరు చేసి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ పనులు పూర్తయితే గ్రామంలో పారిశుద్ధ్య పరిస్థితులు మెరుగుపడి ప్రజలకు ఎంతో ఉపశమనం కలుగుతుందని తెలిపారు. గ్రామాభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ చూపాలని, కోటాలపల్లి గ్రామ ప్రజల దీర్ఘకాల సమస్యలను పరిష్కరించాలని సర్పంచ్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆకుల శ్యాం కుమార్, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామ నాయకులు పాల్గొని గ్రామ సమస్యలను ఎమ్మెల్యేకు వివరించి, తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామ ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే నిధుల ద్వారా అభివృద్ధి పనులకు ఆమోదం తెలపాలని వారు విజ్ఞప్తి చేశారు.

# రాఘవపూర్‌లో అభివృద్ధి సందడి





**ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గులతో శుభారంభం**
**మహిళా సంఘ భవన నిర్మాణానికి శ్రీకారం --**
**ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో మహిళ సంఘ భవనం**
**కమ్యూనిటీ సోక్‌పిట్ నిర్మాణం**





**కామారెడ్డి, ప్రతినిధి జూలై 24 (ప్రజాజ్యోతి)** కామారెడ్డి మండలం రాఘవపూర్ గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా కొనసాగుతున్నాయి. ఇందిరమ్మ గృహాల లబ్ధిదారుల ఇళ్లకు ముగ్గులు వేయడం, మహిళా సంఘ భవన నిర్మాణానికి శుభారంభం చేయడం, అలాగే ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో 10 లక్షలతో మహిళా సంఘ భవనం నిర్మాణం కమ్యూనిటీ సోక్‌పిట్ నిర్మాణం చేపట్టడం వంటి కార్యక్రమాలు ఒకే రోజు గ్రామంలో నిర్వహించడంతో పండుగ వాతావరణం నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం నిరుపేద కుటుంబాలకు గౌరవప్రదమైన జీవనం కల్పించాలనే లక్ష్యంతో అమలు చేస్తున్న ఇందిరమ్మ గృహ పథకం కింద రాఘవపూర్ గ్రామానికి చెందిన పెరుమండ్ల రేవతి, భూక్య లక్ష్మి, గుగులోత్ నానుకు ఇళ్లు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా వారి కొత్త ఇళ్ల వద్ద సంప్రదాయబద్ధంగా రంగురంగుల ముగ్గులు వేసి శుభారంభ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ ప్రజలు, మహిళలు, ప్రజాప్రతినిధులు లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేసి వారి ఆనందంలో పాలుపంచుకున్నారు.

ఇందిరమ్మ గృహ పథకం ద్వారా గుడిసెల్లో, అద్దె ఇళ్లలో, శిథిలావస్థలో ఉన్న నివాసాల్లో జీవిస్తున్న పేద కుటుంబాలకు శాశ్వత నివాసం కల్పించడం రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పాలనకు నిదర్శనమని గ్రామస్తులు పేర్కొన్నారు. సొంత ఇంటి కల నెరవేరడంతో లబ్ధిదారులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా గ్రామ మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని గ్రామ మహిళా సంఘానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.10 లక్షలు మంజూరు చేసింది. ఈ నిధులతో నిర్మించనున్న మహిళా సంఘ భవనానికి కూడా ముగ్గులు వేసి శుభారంభం చేశారు. మహిళా సంఘాల సమావేశాలు, శిక్షణా కార్యక్రమాలు, స్వయం ఉపాధి కార్యక్రమాల నిర్వహణకు ఈ భవనం ఎంతో ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు. మహిళల సాధికారతకు ఈ భవనం ఒక కేంద్రంగా నిలుస్తుందని గ్రామ మహిళలు హర్షం వ్యక్తం చేశారు.

గ్రామాభివృద్ధిలో భాగంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్) నిధులతో రాఘవపూర్ తండాలో కమ్యూనిటీ సోక్‌పిట్ నిర్మాణ పనులను కూడా ప్రారంభించారు. గ్రామంలో మురుగు నీటి సమస్యను తగ్గించడం, పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడం, దోమల వ్యాప్తిని అరికట్టడం, పరిశుభ్రమైన వాతావరణాన్ని నెలకొల్పడం ఈ పనుల ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. ఈ నిర్మాణం పూర్తయితే గ్రామ ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఎడ్ల వీనిల నరేష్ మాట్లాడుతూ, గ్రామంలో అభివృద్ధి పనులు నిరంతరం కొనసాగుతున్నాయని, ప్రభుత్వం అందిస్తున్న ప్రతి సంక్షేమ పథకం అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామంలో మౌలిక వసతుల కల్పన, పారిశుద్ధ్య పనులు, మహిళల అభివృద్ధి, తాగునీటి సౌకర్యాలు, రహదారుల అభివృద్ధి వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు.


గ్రామపంచాయతీ కార్యదర్శి మాధవీలత ఉప సర్పంచ్ నరేష్ , ఏపీవో అన్నపూర్ణ, ఏపీఎం శ్రీనివాస్, సీసీ శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎడ్ల వీనిల నరేష్, గ్రామపంచాయతీ కార్యదర్శి మాధవీలత, ఏపీవో అన్నపూర్ణ, ఏపీఎం శ్రీనివాస్, సీసీ శ్రీనివాస్, గ్రామ సంఘం అధ్యక్షురాలు మంద లక్ష్మి, వీవోఏ లావణ్య, ఉపసర్పంచ్ నరేష్, మహిళా సంఘ సభ్యులు, గ్రామపంచాయతీ సభ్యులు, లబ్ధిదారులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గ్రామంలో ఒకే రోజు సంక్షేమం, అభివృద్ధి, పారిశుద్ధ్యం, మహిళా సాధికారతకు సంబంధించిన పలు కార్యక్రమాలు నిర్వహించడం పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఇదే విధంగా ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయించి ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపర్చాలని వారు కోరారు.

## బరువు తక్కువగా జన్మించిన నవజాత శిశువుకు సకాలంలో వైద్యసాయం

**కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రి నుంచి నియోనాటల్ 108 అంబులెన్స్‌లో నిజామాబాద్‌కు తరలింపు**
**వైద్య సిబ్బంది, 108 బృందానికి కుటుంబ సభ్యుల కృతజ్ఞతలు**



**కామారెడ్డి, ప్రతినిధి జూలై 24 (ప్రజాజ్యోతి)** కామారెడ్డి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో బరువు తక్కువగా జన్మించిన నవజాత ఆడ శిశువుకు సకాలంలో అత్యవసర వైద్యసేవలు అందించి, మెరుగైన చికిత్స కోసం నియోనాటల్ 108 అంబులెన్స్ ద్వారా నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించిన ఘటన స్థానికంగా ప్రశంసలు అందుకుంటోంది. వైద్యులు, 108 అత్యవసర సేవల సిబ్బంది సమన్వయంతో శిశువును సురక్షితంగా ఉన్నత వైద్య కేంద్రానికి చేర్చడంతో కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. సదాశివ నగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామానికి చెందిన హనుమండ్ల సంతోషి తన మూడో కాన్పులో శస్త్రచికిత్స ద్వారా ఈ రోజు ఉదయం సుమారు 10 గంటల సమయంలో ఆడ శిశువుకు జన్మనిచ్చింది. అయితే పాప బరువు చాలా తక్కువగా ఉండటంతో పాటు పుట్టిన వెంటనే శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంది. సరిగా ఏడవకపోవడం, శరీర స్పందనలు మందగించడం వంటి లక్షణాలు కనిపించడంతో వైద్యులు వెంటనే ప్రత్యేక పర్యవేక్షణలో చికిత్స ప్రారంభించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు, నర్సింగ్ సిబ్బంది శిశువు ఆరోగ్య పరిస్థితిని నిరంతరం గమనిస్తూ అవసరమైన చికిత్స అందించారు. అయినప్పటికీ పరిస్థితిలో ఆశించిన మేర మెరుగుదల కనిపించకపోవడంతో, మరింత ఉన్నత స్థాయి వైద్య సేవలు అవసరమని నిర్ణయించారు. దీంతో సాయంత్రం సుమారు 7.30 గంటలకు ప్రత్యేకంగా నవజాత శిశువుల కోసం ఏర్పాటు చేసిన నియోనాటల్ 108 అంబులెన్స్ ద్వారా శిశువును నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి అత్యంత జాగ్రత్తగా తరలించారు. ప్రయాణ సమయంలో అంబులెన్స్‌లోని అత్యవసర వైద్య పరికరాలతో శిశువుకు నిరంతర వైద్య పర్యవేక్షణ అందిస్తూ, ఆరోగ్య పరిస్థితిని స్థిరంగా ఉంచేందుకు 108 సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకునే సమయానికి శిశువు ఆరోగ్య పరిస్థితి కొంత మెరుగుపడిందని వైద్యులు గుర్తించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న శిశువు తండ్రి నవీన్ ఆనందం వ్యక్తం చేస్తూ, తమ బిడ్డ ప్రాణాలను కాపాడేందుకు అహర్నిశలు శ్రమించిన కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులకు, నర్సింగ్ సిబ్బందికి, అలాగే నియోనాటల్ 108 అంబులెన్స్ బృందానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సేవలో విధులు నిర్వహించిన ఈఎంటీ కృష్ణస్వామి, పైలట్ మహేష్ తమ బాధ్యతను అత్యంత నిబద్ధతతో నిర్వహించి శిశువును సురక్షితంగా నిజామాబాద్ ఆస్పత్రికి చేర్చారు. వారి సేవలను కుటుంబ సభ్యులతో పాటు స్థానికులు కూడా అభినందించారు. నవజాత శిశువులకు అత్యవసర పరిస్థితుల్లో ప్రత్యేక వైద్యసేవలు అందించడంలో నియోనాటల్ 108 అంబులెన్స్ సేవలు ఎంత కీలకమో ఈ ఘటన మరోసారి నిరూపించిందని వైద్యవర్గాలు పేర్కొన్నాయి. సమయానికి తీసుకున్న నిర్ణయం, వైద్యుల సమన్వయం, 108 సిబ్బంది అప్రమత్తత కారణంగానే శిశువుకు మెరుగైన చికిత్స అందే అవకాశం లభించిందని వారు తెలిపారు

## ధర్మారావుపేటలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు జన్మదిన వేడుకలు

**కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన నాయకులు**
**భారీగా తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులు**



**కామారెడ్డి ప్రతినిధి జూలై 24 (ప్రజాజ్యోతి)** కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం ధర్మారావుపేట గ్రామంలో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) జన్మదిన వేడుకలను పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అత్యంత వైభవంగా, ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. గ్రామం మొత్తం పండుగ వాతావరణాన్ని తలపించేలా పార్టీ జెండాలు, బ్యానర్లు, ఫ్లెక్సీలతో అలంకరించి వేడుకలను ప్రత్యేకంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముందుగా కేటీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జన్మదిన కేక్‌ను కట్ చేసి ఒకరికొకరు తినిపించుకుంటూ శుభాకాంక్షలు తెలియజేశారు. బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచిపెట్టి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు కేటీఆర్ నాయకత్వాన్ని కొనియాడుతూ తెలంగాణ అభివృద్ధిలో ఆయన పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి, యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు, పారిశ్రామిక రంగ ప్రోత్సాహానికి, ఐటీ రంగ విస్తరణకు కేటీఆర్ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేసిన నాయకుడిగా కేటీఆర్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందని పేర్కొన్నారు. ఆయనకు మంచి ఆరోగ్యం, దీర్ఘాయుష్షు ప్రసాదించాలని ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఉమర్, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, యువ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పార్టీ శ్రేణులు కేటీఆర్‌కు మద్దతుగా నినాదాలు చేస్తూ ఉత్సాహంగా వేడుకలను నిర్వహించారు. కార్యక్రమం మొత్తం ఆహ్లాదకర వాతావరణంలో సాగగా, గ్రామ ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో హాజరై వేడుకలను విజయవంతం చేశారు. జన్మదిన వేడుకలు ధర్మారావుపేట గ్రామంలో బీఆర్ఎస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయని నాయకులు పేర్కొన్నారు.

## ఇస్రోజీవాడిలో ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గులతో ముస్తాబు

**లబ్ధిదారుల ఆనందోత్సాహాల మధ్య గ్రామంలో ప్రత్యేక కార్యక్రమం**
**పాల్గొన్న సర్పంచ్, పాలకవర్గ సభ్యులు**



**కామారెడ్డి, ప్రతినిధి జూలై 24 (ప్రజాజ్యోతి):** కామారెడ్డి మండలం ఇస్రోజీవాడి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల కోసం ప్రత్యేకంగా ముగ్గులు వేసే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వం పేదలకు అందిస్తున్న ఇందిరమ్మ గృహ పథకం ద్వారా ఇళ్లు పొందిన లబ్ధిదారుల కొత్త గృహాల వద్ద రంగురంగుల ముగ్గులు వేసి గ్రామంలో పండుగ వాతావరణాన్ని నెలకొల్పారు. గ్రామంలో ఇప్పటి వరకు సొంత ఇల్లు లేక గుడిసెల్లో, అద్దె ఇళ్లలో జీవనం సాగించిన పేద కుటుంబాలకు ప్రభుత్వం ఇందిరమ్మ పథకం ద్వారా పక్కా గృహాలు మంజూరు చేయడం పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల ఇళ్ల ముందు అందమైన ముగ్గులు వేయడం ద్వారా వారి ఆనందాన్ని గ్రామస్తులు పంచుకున్నారు. వక్తలు మాట్లాడుతూ, నిరుపేదలకు సొంతింటి కలను సాకారం చేసే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ గృహ పథకం ఎంతో మంది కుటుంబాలకు ఆశాకిరణంగా నిలుస్తోందని పేర్కొన్నారు. పేదల జీవన ప్రమాణాలను మెరుగుపర్చే దిశగా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలకు గ్రామ ప్రజలు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, లబ్ధిదారులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు మరింత వేగవంతం కావాలని ఆకాంక్షించారు.

## కిష్టాపూర్‌లో కేటీఆర్ జన్మదిన వేడుకలు



**బీర్కూర్, జూలై 24 (ప్రజాజ్యోతి ):** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని కిష్టాపూర్ గ్రామంలో గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు గైని సంజు ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యువకులు పాల్గొని కేటీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## పట్టు కోసం కమలం బిగ్ ప్లాన్



**హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయ వేదికపై అధికారాన్ని చేజిక్కించుకోవడమే ఏకైక లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ అధిష్టానం అత్యంత వేగంగా పావులు కదుపుతోంది. సాంప్రదాయ రాజకీయ శైలికి భిన్నంగా, పూర్తిగా డేటా ఆధారిత కార్పొరేట్ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ వ్యూహాలకు పదును పెడుతోంది. ఇందులో భాగంగా ఆపరేషన్ సాఫ్రాన్ పేరుతో ప్రొఫెషనల్ ఎలక్షన్ ఏజెన్సీలను క్షేత్రస్థాయిలోకి దించనుంది. రాబోయే జీహెచ్ఎంసీ, అసెంబ్లీ ఎన్నికలను లక్ష్యంగా చేసుకుని ఇప్పటి నుంచే ముమ్మరంగా గ్రౌండ్ వర్క్ ప్రారంభించింది.గత అనుభవాలు, ఎన్నికల ఫలితాలను విశ్లేషించిన బీజేపీ హైకమాండ్, ఈసారి ముగ్గురు కీలక నేతల మార్గదర్శకంలో మూడు ప్రత్యేక ప్రొఫెషనల్ ఏజెన్సీలను రంగంలోకి దించింది. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ సంస్థాగత ప్రధాన కార్యదర్శి బి.ఎల్. సంతోష్ ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ బృందాలు పనిచేస్తున్నాయి. ఇందులో మొదటిది అసోసియేషన్ ఆఫ్ బిలియన్ మైండ్స్. హోంమంత్రి అమిత్ షా నేరుగా పర్యవేక్షించే ఈ సంస్థ, గత కొన్ని నెలలుగా తెలంగాణలో పార్టీ పొలిటికల్ ఎజెండా, ప్రచార వ్యూహాలను నిశితంగా రూపొందిస్తోంది. ఇక రెండోది జార్విస్. సాంకేతికత, కమ్యూనికేషన్ ప్లాట్‌ఫామ్‌లపై ఈ ఏజెన్సీ దృష్టి సారించింది. భారీ కాల్ సెంటర్ల నిర్వహణ ద్వారా నియోజకవర్గాల్లోని ఓటర్లను నేరుగా సంప్రదించడం, ప్రజల అభిప్రాయాలను సమీకరించడం, బూత్ కమిటీల పనితీరును పర్యవేక్షించడం వంటి బాధ్యతలను చూస్తోంది. అంతేకాకుండా పార్టీ కార్యకర్తలు, నాయకుల నిర్వహణ కోసం రూపొందించిన 'సరళ్ యాప్' బాధ్యతలను కూడా జార్విస్ సమర్థవంతంగా నిర్వహిస్తోంది. ఇక మూడోది అభీష్ట టీమ్. పశ్చిమ బెంగాల్, బిహార్ ఎన్నికలలో కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్ పర్యవేక్షణలో కీలక పాత్ర పోషించి, మెరుగైన ఫలితాలను అందించిన 'అభీష్ట' ప్రొఫెషనల్ ఏజెన్సీని తాజాగా తెలంగాణకు రప్పించారు. ఈ టీమ్ బి.ఎల్.సంతోష్ పర్యవేక్షణలో బూత్ స్థాయి నుంచి అసెంబ్లీ స్థాయి వరకు లోతైన అధ్యయనం చేస్తోంది.క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను అంచనా వేసేందుకు 'అభీష్ట' బృందం ప్రస్తుతం 'సర్' అంటే స్టడీ, అండర్ స్టాండ్, రిపోర్ట్ ప్రక్రియను చేపట్టింది. పార్టీ సంస్థాగత నిర్మాణం ఏ విధంగా ఉంది? బూత్ లెవెల్ ఏజెంట్లు సరిగ్గా పనిచేస్తున్నారా? అనే అంశాలపై నివేదికలను ఎప్పటికప్పుడు ఢిల్లీ అధిష్టానానికి అందిస్తోంది.ఈ వ్యూహంలో అత్యంత కీలకమైన అంశం ఏమిటంటే.. రాష్ట్రంలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో గెలుపును ప్రభావితం చేయగల 50 నుంచి 100 మంది ప్రముఖ వ్యక్తుల జాబితాను ఈ టీమ్ సిద్ధం చేస్తోంది. ఇందులో రాజకీయ నేతలతో పాటు సమాజంలో మంచి పేరున్న వ్యాపారవేత్తలు, మేధావులు, సామాజిక వేత్తలు, ప్రజాదరణ ఉన్న వ్యక్తులను గుర్తిస్తున్నారు. వీరిని పార్టీ వైపు ఆకర్షించడం లేదా పార్టీ విజయంలో వీరి మద్దతును వినియోగించుకోవడంపై ప్రణాళికలు రచిస్తున్నారు.కేవలం కేంద్ర నాయకత్వపు నివేదికలపైనే ఆధారపడకుండా, ఈ ఏజెన్సీలకు లోకల్‌గా అవసరమైన సహాయ సహకారాలు అందించడానికి బీజేపీ, దాని అనుబంధ సంఘాల నుంచి శిక్షణ పొందిన వాలంటీర్లను నియమించారు. రాష్ట్రంలో ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను పక్కాగా అసెస్ చేసి, దానిని ఓట్లుగా మార్చుకునేందుకు స్పష్టమైన రూట్ మ్యాప్‌ను సిద్ధం చేస్తున్నారు. ఇతర పార్టీలలో తీవ్ర అసంతృప్తితో ఉన్న నాయకులను చేర్చుకోవడంలోనూ ఈ ఏజెన్సీల గ్రౌండ్ రిపోర్టులు మార్గదర్శకంగా నిలవనున్నాయి.మొదటగా జీహెచ్ఎంసీ పరిధిలోని ఓటర్ల నాడిని పట్టుకుని, అభ్యర్థుల ఎంపిక నుంచి ప్రచార సరళి వరకు బ్యాక్ ఎండ్ నుంచి నడిపించేందుకు సిద్ధమయ్యారు. కేవలం స్థానిక నాయకత్వ బలంపైనే ఆధారపడకుండా, ఇటువంటి ఆధునిక డేటా విశ్లేషణ, కార్పొరేట్ తరహా ఎలక్షన్ మేనేజ్‌మెంట్ పద్ధతులు రాబోయే ఎన్నికల్లో బీజేపీకి ఎంతవరకు ప్రయోజనం చేకూరుస్తాయో వేచి చూడాలి.

## పావురాలకు మేత వేయడంపై ఆంక్షలు

**హైదరాబాద్ :** హైదరాబాద్, సికింద్రాబాద్ కవల నగరాల పరిధిలో పావురాలకు విచ్చలవిడిగా మేత వేయడం వల్ల ప్రజా ఆరోగ్యం, పర్యావరణం తీవ్ర ప్రమాదంలో పడుతున్నాయని తెలంగాణలో హైకోర్టులో పిల్ దాఖలైంది. దీనిపై స్పందించిన హైకోర్టు ధర్మాసనం మేత నియంత్రణకు తీసుకున్న చర్యలపై మూడు వారాల్లో సమగ్ర అఫిడవిట్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. జనావాసాలు, ఆసుపత్రులు, వారసత్వ కట్టడాల సమీపంలో పావురాలకు మేత వేయడాన్ని క్రమబద్ధీకరించాలని దాఖలైన ఈ పిటిషన్‌పై తదుపరి విచారణను ఆగస్టు 25కి వాయిదా వేసింది. అయితే వాటికి మేత వేయటం వల్ల నష్టాలేంటి..? పావురాల అంత ప్రమాదకరమా..? ఆ విషయాలు తెలుసుకుందాం.హైదరాబాద్, సికింద్రాబాద్ నగర పరిధిలో విచ్చలవిడిగా పావురాలకు మేత వేయటంపై తెలంగాణ హైకోర్టు తీవ్రంగా స్పందించింది. పావురాల మేతను నియంత్రించడానికి, వాటి సంతతి పెరుగుదలను అరికట్టడానికి తీసుకున్న చర్యలపై మూడు వారాల్లోగా పూర్తి వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బుధవారం (జులై 22) ఆదేశించింది. నగరానికి చెందిన ప్రముఖ వైద్యుడు రాధేశ్యామ్ తపాడియా దాఖలు చేసిన ప్రజాహిత పిటిషన్ పై ప్రధాన న్యాయమూర్తి అపరేష్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం ఈ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. పిటిషనర్ తరఫు న్యాయవాది దీపక్ మిశ్రా కోర్టుకు తన వాదనలు వినిపిస్తూ.. నివాస ప్రాంతాలు, ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు, రద్దీగా ఉండే పబ్లిక్ ప్రాంతాలు, చారిత్రక వారసత్వ కట్టడాల సమీపంలో ఎలాంటి నిబంధనలు లేకుండా పావురాలకు మేత వేస్తున్నారని తెలిపారు. దీనివల్ల నగరంలో పావురాల సంఖ్య విపరీతంగా పెరిగిపోయాని ఆందోళన వ్యక్తం చేశారు. పావురాల మేతను నియంత్రించడంలో, ఆరోగ్యం, పర్యావరణ ముప్పులను అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం, జీహెచ్ఎంసీ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని పిటిషనర్ వాదించారు. అధికారుల తీరు రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 21 ద్వారా పౌరులకు సంక్రమించిన జీవించే హక్కును కాలరాసేలా ఉందని ఇది పూర్తిగా చట్టవిరుద్ధమని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.అనుమతి లేని ప్రదేశాల్లో మేత వేసే వారికి కఠిన జరిమానాలు విధించడం, ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, పావురాల సంఖ్యను నియంత్రించడానికి మానవీయ, పర్యావరణ రహిత సమతుల్య పద్ధతులను అవలంబించేలా ఆదేశించాలని పిల్ ద్వారా విజ్ఞప్తి చేశారు. వాదనలు విన్న ధర్మాసనం ఈ వ్యవహారంపై తదుపరి విచారణను ఆగస్టు 25వ తేదీకి వాయిదా వేసిందిహైకోర్టు ఆదేశాల నేపథ్యంలో పావురాల మేతపై చర్చ మె?దలైంది. అవి అంత ప్రమాదకరమా..? అని ప్రజలు చర్చించుకున్నాయి. అయితే అది నిజమేనని అంటున్నారు వైద్య నిపుణులు. వారు వెల్లడించిన వివరాల ప్రకారం.. నగరాల్లో ఆహారం సులభంగా దొరకడం వల్ల పావురాల సంఖ్య నియంత్రణ లేకుండా పెరిగి ప్రకృతి సమతుల్యత దెబ్బతింటోంది. ఆహార వ్యర్థాలు నేలపై పడి కుళ్ళిపోవడంతో పాటు పావురాల రెట్టలు భవనాలను దెబ్బతీస్తూ గాలిలో కలిసే ప్రమాదకర క్రిములకు నిలయంగా మారుతున్నాయి. పావురాల ఈకలు, ఎండిపోయిన రెట్టల నుంచి వచ్చే ధూళి గాలిలో కలవడం వల్ల మానవులకు తీవ్రమైన శ్వాసకోశ, ఊపిరితిత్తుల వ్యాధులు సంభవిస్తున్నాయట.ముఖ్యంగా పావురాల సావాసం వల్ల హైపర్ సెన్సిటివిటీ ప్యానెమోనైటిస్ అనే అలెర్జీ వచ్చి అది కాలక్రమేణా ఊపిరితిత్తులను శాశ్వతంగా దెబ్బతీసే లంగ్ ఫైబ్రోసిస్‌కు దారితీస్తుందని చెబుతున్నారు. అలాగే వీటి ద్వారా వ్యాపించే సిట్టకోసిస్ అనే బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్ వల్ల తీవ్రమైన జ్వరం, ఛాతీ నొప్పి, న్యుమోనియా వంటి సమస్యలు వస్తాయట. వీటి రెట్టలలో పెరిగే ఫంగస్ కారణంగా హిస్టోప్లాస్మోసిస్, క్రిప్టోకోకోసిస్ వంటి ఫంగల్ ఇన్ఫెక్షన్లు వచ్చి ఊపిరితిత్తులతో పాటు నరాల వ్యవస్థ, మెదడుపై తీవ్ర ప్రభావం చూపుతాయని అంటున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు, ఆస్తమా బాధితులకు ఈ ధూళి వల్ల శ్వాసకోశ అలెర్జీలు మరింత ఎక్కువవుతాయని చెబుతున్నారు.

# ఎంబీటీకి కాంగ్రెస్ సపోర్ట్

**హైదరాబాద్ :** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సమయం దగ్గరపడుతుండటంతో భాగ్యనగర రాజకీయాలు, ముఖ్యంగా పాతబస్తీ వేదికగా సరికొత్త మలుపు తిరుగుతున్నాయి. దశాబ్దాలుగా ఆల్ ఇండియా మజ్లిస్-ఎ-ఇత్తెహాదుల్ ముస్లిమీన్ పార్టీకి తిరుగులేని కోటగా ఉన్న పాతబస్తీలో ఈసారి మునుపెన్నడూ లేని విధంగా ఒక ఆసక్తికరమైన పొలిటికల్ ఈక్వేషన్ తెరపైకి వచ్చింది. ఎంఐఎంను వారి సొంత గడ్డపైనే కట్టడి చేసేందుకు అధికార కాంగ్రెస్ పార్టీ, స్థానిక మజ్లిస్ బచావో తెహ్రీక్ తో చేతులు కలిపి ఉమ్మడి కూటమిగా బరిలోకి దిగే ప్రయత్నాలు చేస్తోంది. చార్మినార్, బహదూర్‌పురా, యాకుత్‌పురా, కార్వాన్ నియోజకవర్గాల పరిధిలోని మున్సిపల్ డివిజన్లు ఎప్పుడూ ఎంఐఎంకు ఏకపక్ష విజయాలను అందిస్తూ వచ్చాయి. అయితే, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఈసారి పాతబస్తీని నామమాత్రంగా వదిలేయడానికి సిద్ధంగా లేదు. ఎంఐఎం వ్యతిరేక ఓటు బ్యాంకును చీల్చకుండా, పాతబస్తీ గల్లీల్లో బలమైన క్యాడర్ ఉన్న ఎంబీటీ తో అధికారిక లేదా అనధికారిక అవగాహనకు వచ్చేందుకు కాంగ్రెస్ వ్యూహాత్మక అడుగులు వేస్తోంది. బహదూర్‌పురా, యాకుత్‌పురా వంటి డివిజన్లలో ముస్లిం మైనారిటీ ఓటర్ల విభజనను నిరోధించి, ఉమ్మడి అభ్యర్థులను రంగంలోకి దించడం ద్వారా ఎంఐఎంకు చమటలు పట్టించాలని కాంగ్రెస్ స్థానిక నాయకత్వం భావిస్తోంది.పాతబస్తీలో ఎంఐఎంకు సైద్ధాంతికంగా, రాజకీయంగా గట్టి పోటీ ఇచ్చే ఏకైక స్థానిక శక్తి 'మజ్లిస్ బచావో తెహ్రీక్' . అమన్ నగర్, యాకుత్‌పురా, చంచల్‌గూడ వంటి పాకెట్స్‌లో ఎంబీటీకి ఇరవై ముప్పై ఏళ్లుగా చెక్కుచెదరని వాలంటీర్ నెట్‌వర్క్ ఉంది. కాంగ్రెస్ పార్టీకి పాతబస్తీలో నాయకత్వం ఉన్నప్పటికీ, గల్లీ స్థాయి బూత్ మేనేజ్‌మెంట్ బలహీనంగా ఉండేది. ఇప్పుడు ఎంబీటీ నెట్‌వర్క్‌ను కాంగ్రెస్ తనతో కలుపుకోవడం ద్వారా, ఎంఐఎం కోటలోని లూప్‌హోల్స్‌ను సులభంగా టార్గెట్ చేయగలుగుతోంది. ముఖ్యంగా మైనారిటీలలోని మతపరమైన సెంటిమెంట్ల కంటే, స్థానిక సమస్యలపై ఎంబీటీ చేసే పోరాటాలు కాంగ్రెస్‌కు క్షేత్రస్థాయిలో మైలేజ్ ఇస్తున్నాయి.ఈసారి పాతబస్తీ ఎన్నికల సరళిలో కనిపిస్తున్న అతిపెద్ద మార్పు.. అక్కడి యువత ఆలోచనా విధానం. దశాబ్దాలుగా కేవలం భావోద్వేగాలు, మతపరమైన



సెంటిమెంట్ల ఆధారంగానే పాతబస్తీలో ఓటింగ్ జరుగుతూ వచ్చింది. కానీ, చదువుకున్న నేటి తరం యువత మా గల్లీ పరిస్థితి ఏంటి అని ప్రశ్నిస్తోంది. నిరంతరం పొంగిపొర్లే డ్రైనేజీలు, కలుషిత తాగునీటి సరఫరా, వర్షం వస్తే మునిగిపోయే రోడ్లు, ఉపాధి అవకాశాల లేమి వంటి మౌలిక సమస్యలపై యువతలో తీవ్ర అసంతృప్తి ఉంది. ఐటీ కారిడార్ ఉన్న హైటెక్ సిటీ అభివృద్ధిని, తమ పాతబస్తీ వెనుకబాటుతనాన్ని పోల్చి చూసుకుంటున్న యువత.. ఈసారి మార్పు వైపు మొగ్గు చూపే సంకేతాలు గల్లీల్లో స్పష్టంగా కనిపిస్తున్నాయి. కార్వాన్, యాకుత్‌పురా నియోజకవర్గాల్లోని కొన్ని డివిజన్లలో దశాబ్దాలుగా డ్రైనేజీ వ్యవస్థ ఆధునికీకరణకు నోచుకోలేదు. తాగునీటి పైప్‌లైన్లు, మురుగునీటి లైన్లు కలిసిపోయి కలుషిత నీరు వస్తోందని స్థానికులు ఆగ్రహంతో ఉన్నారు. ఈ పౌర సమస్యలనే కాంగ్రెస్-ఎంబీటీ కూటమి తమ ప్రధాన ఎన్నికల అస్త్రాలుగా మలచుకుంది. అధికారంలో ఉన్నందున తాము గెలిస్తేనే పాతబస్తీ డెవలప్‌మెంట్‌కు నిధులు వస్తాయనే డబుల్ ఇంజన్ కార్డ్‌ను కాంగ్రెస్ బలంగా వాడనుంది.ఈ ఉమ్మడి దాడిని ఎంఐఎం అధినాయకత్వం కూడా తేలిగ్గా తీసుకోవడం లేదు. అసంతృప్తిగా ఉన్న డివిజన్లలో సిట్టింగ్ కార్పొరేటర్లను మార్చడం, యువతకు కొత్తగా టికెట్లు కేటాయించడం ద్వారా యాంటీ-ఇంకంబెన్సీని తగ్గించుకోవాలని అసదుద్దీన్ ఒవైసీ వ్యూహాలు రచిస్తున్నారు. తాము లేకపోతే పాతబస్తీలో ముస్లింల రాజకీయ అస్తిత్వం ప్రమాదంలో పడుతుందనే పాత సెంటిమెంట్‌ను మళ్లీ తెరపైకి తెస్తున్నారు. అయితే, గతంలో లాగా కాకుండా ఈసారి ప్రతి గల్లీలోనూ కాంగ్రెస్-ఎంబీటీ కూటమి గట్టిగా ఎదురుతిరుగుతుండటంతో, ఎంఐఎం తన అభ్యర్థులను గెలిపించుకోవడానికి మునుపటి కంటే ఎక్కువ శ్రమించాల్సి ఉంటుంది. కాంగ్రెస్ పార్టీ అధికార బలం, ఎంబీటీ లోకల్ క్యాడర్, యువతలో ఉన్న సివిక్ అసంతృప్తి.. ఈ మూడు కలిస్తే ఎంఐఎం అజేయ శక్తేమీ కాదని నిరూపించే అవకాశం ఉంది. ఎంఐఎం తన కోటను కాపాడుకుంటుందా లేక కాంగ్రెస్-ఎంబీటీ కూటమి పాతబస్తీ గల్లీల్లో కొత్త చరిత్ర లిఖిస్తుందా అనేది రాబోయే రోజుల్లో జరిగే హైవోల్టేజ్ పోలింగ్ తేల్చనుంది. గ్రేటర్ ఎన్నికలు ఎప్పుడు నిర్వహించినా.. తీవ్ర పోరు ఖాయమని అనుకోవచ్చు.

## మెదక్ కే పరిమితమౌతున్న హరీష్

# పార్టీలో రసవత్తరంగా చర్చ

**మెదక్ :** హరీష్ రావు సొంత నియోజకవకర్గం సిద్ధిపేటలో చేసిన పాదయాత్ర ఇప్పుడు హాట్ టాపిక్. కేవలం పదిహేను కిలోమీటర్లు చేసిన పాదయాత్రతో రాష్ట్రం మొత్తం చూపు తన వైపునకు తిప్పుకున్నారు. తెలంగాణ రాజకీయాల్లో ట్రబుల్ షూటర్ గా, పక్కా మాస్ లీడర్‌గా తన్నీరు హరీష్ రావుకు ఉన్న క్రేజ్, క్యాడర్ బేస్ ప్రత్యేకం. ఉద్యమ సమయం నుంచి నేటి వరకు పార్టీకి ఏ కష్టం వచ్చినా ముందు వరుసలో నిలబడి పరిష్కరించడం ఆయన శైలి. తాను ఎప్పుడూ ఉన్నత పదవులకో, ఆధిపత్యానికో ఆశపడలేదని, అధినాయకత్వపు నిర్ణయాలకు కట్టుబడి ఉంటానని ఆయన ఎన్నో సార్లు స్పష్టం చేశారు. అయినప్పటికీ, బీఆర్ఎస్ శ్రేణులను బలహీనపర చడానికి, అధినాయకత్వానికి-హరీష్‌రావుకు మధ్య అనుమానాల బీజాలు నాటడానికి ప్రత్యర్థి వర్గాలు నిరంతరం విచిత్రమైన ఊహాగానాలను సృష్టిస్తూనే ఉంటాయి. ఈ రాజకీయ సమీకరణల వల్లే కావచ్చు.. ప్రస్తుతం హరీష్ రావు పాత్రను అధినాయకత్వం కేవలం తన సొంత నియోజకవర్గానికో, ఉమ్మడి మెదక్ జిల్లాకో పరిమితం చేస్తోంది.రాజకీయాల్లో క్షేత్రస్థాయి బలం ఉన్న నాయకుడి పవర్ ఏంటో హరీష్ రావు ఇటీవలి తన సిద్ధిపేట పాదయాత్రల ద్వారా మరోసారి నిరూపించారు. కాళేశ్వరం నీళ్లు, రైతాంగ సమస్యలపై ఆయన కేవలం ఒక మండల స్థాయిలో పిలుపునిస్తేనే వేలాదిగా జనం తరలివచ్చారు. ఏ మీడియా బిల్డప్‌లు, సోషల్ మీడియా ప్రచారాలు లేకుండా నేరుగా ప్రజలతో ఉండే ఈ లైవ్ కనెక్టివిటీ యే ఆయన అసలైన బలం. సోషల్ మీడియా



హడావుడికే పరిమితమైన నేతల మధ్య, రోడ్డెక్కి పోరాటం చేసే మాస్ లీడర్‌గా ఆయనకున్న గుర్తింపు చెక్కుచెదరలేదు. అయితే, ఈ స్థాయి క్రేజ్ చూసిన ప్రతిసారీ సొంత పార్టీలోనే కొందరు వ్యతిరేకులు ఆయనపై ముద్రలు వేయడం, ఆయన సైలెంట్ అయితే పార్టీపై అలిగారని ప్రత్యర్థులు ప్రచారం చేయడం ఒక పరిపాటిగా మారింది.బీఆర్ఎస్ ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా పునర్వైభవం కోసం పోరాడుతున్న తరుణంలో, హరీష్ రావు సేవలను కేవలం ఒక జిల్లాకే పరిమితం చేయడం వ్యూహాత్మక తప్పిదమేనని భావిస్తున్నారు. హరీష్ రావుకు ఎలాంటి సరిహద్దు ఆంక్షలు విధించకుండా, రాష్ట్రవ్యాప్తంగా పార్టీ బాధ్యతలు అప్పగిస్తే బీఆర్ఎస్ క్యాడర్‌లో వచ్చే ఊపు అసాధారణంగా ఉంటుంది. తెలంగాణలోని ప్రతి నియోజకవర్గంలోనూ ఆయనకు అభిమానులు, అనుచరులు ఉన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ప్రజా సమస్యలపై నిలదీయడంలో గానీ, క్షేత్రస్థాయిలో కేడర్‌ను సమాయత్తం చేయడంలో గానీ హరీష్‌కున్న రాజకీయ చాకచక్యం అపారమైనది.కానీ, ఈ నిర్ణయం తీసుకోవడానికి బీఆర్ఎస్ అధినాయకత్వం వెనుకంజ వేయడానికి అంతర్గత కుటుంబ, వారసత్వ రాజకీయ సమీకరణలే ప్రధాన కారణమని అందరికీ తెలుసు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కేటీఆర్ ఉన్నందున , హరీష్ రావు మాస్ ఇమేజ్ దాన్ని డామినేట్ చేస్తుందేమోననే ముందస్తు ఆందోళనలు, భయాలు ఉండవచ్చు. వారి అంతర్గత ప్రాధాన్యతలు ఏవైనప్పటికీ, అధికారంలో లేని సమయంలో పార్టీకి అత్యంత అవసరమైన అస్త్రాన్ని సిద్ధంగా పెట్టుకుని పూర్తిస్థాయిలో వాడుకోకపోవడం గులాబీ దళానికి తీవ్ర నష్టం కలిగిస్తుందనడంలో సందేహం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ధీటుగా ఎదుర్కోవాలన్నా, కిందిస్థాయి కార్యకర్తల్లో ఉత్సాహం నింపాలన్నా హరీష్ రావుకు స్వేచ్ఛాయుతమైన రాష్ట్ర స్థాయి బాధ్యతలు ఇవ్వాల్సిన అవసరం ఉంది. ప్రజా సమస్యలపై పోరాడే శక్తి, పక్కా వ్యూహాలు రచించే నైపుణ్యం ఉన్న నాయకుడికి పరిమితులు విధించడం వల్ల పార్టీ తన సొంత బలాన్నే తగ్గించుకున్నట్లవుతోంది. ఇప్పటికైనా బీఆర్ఎస్ నాయకత్వం ధైర్యం చేసి, హరీష్ రావును రాష్ట్రవ్యాప్త పర్యటనలకు, పోరాటాలకు నాయకత్వం వహించేలా ముందువరుసలో నిలబడితేనే.. తెలంగాణలో గులాబీ జెండా మళ్లీ పూర్తిస్థాయిలో ఊపందుకుంటుంది.

# అమిత్ షా టూర్‌పై రసవత్తర చర్చ

**హైదరాబాద్ :** కేంద్ర మంత్రి బీజేపీకి అన్ని విధాలుగా మార్గదర్శకుడు అయిన అగ్ర నేత అమిత్ షా తాజాగా చేపట్టబోతున్న తెలంగాణా పర్యటన రాజాకీయ వర్గాలలో ఆసక్తిని పెంచుతోంది. ఈ ఆదివారం అంటే 26వ తేదీన అమిత్ షా తెలనగణా పర్యటన పెట్టుకున్నారు. ఈ బీజేపీ అగ్రనేత పర్యటనలో భాగంగా ఒక బీఆర్ఎస్ నాయకుడి కళాశాలను సందర్శించడమే ఇపుడు హాట్ పొలిటికల్ టాపిక్ అయింది. దీంతో అనేక రకాలుగా రాజకీయ ఊహాగానాలకు ఈ పరిణామం తెర లేపింది అని అంటున్నారు. బీఆర్ఎస్ బీజేపీ రెండూ ఒక్కటే అని కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలకు బలం చేకూర్చేలా అమిత్ షా తాజా టూర్ ఉండబోతోందా అని కూడా ఆలోచిస్తున్నారు ఇదిలా ఉంటే బీఆర్ఎస్ కి చెందిన కీలక నేత బోయినపల్లి శ్రీనివాసరావుకు ప్రతిమ మెడికల్ కాలేజీ ఉంది. ఈ కాలేజీకి రజతోత్సవ వేడుకలు జరుగుతున్న నేపథ్యంలో అమిత్ షా ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని తెలుస్తోంది. ఇక అమిత్ షా పర్యటన చూస్తే కేవలం కాలేజ్ ఉత్సవాలకే హైదరాబాద్ వచ్చి మళ్ళీ అటునుంచి అటే ఢిల్లీకి వెళ్ళిపోతున్నారని అంటున్నారు. పైగా అదే కాలేజీలో అమిత్ షా మధ్యాహ్న భోజనం చేస్తారని అంటున్నారు. ఒక విధంగా అమిత్ షా వస్తున్నది బీఆర్ఎస్ నేత కార్యక్రమం వారి ఆతిథ్యం స్వీకరించడానికే కావడంతో తెలంగాణా రాజకీయాలు దీని మీదనే హీటెక్కిపోతున్నాయి. ఇంతకీ ఈ బోయినపల్లి శ్రీనివాసరావు ఎవరు అంటే బీఆర్ఎస్ ఎంపీ బి. వినోద్ కుమార్ కి సోదరుడు అని చెబుతున్నారు అని చెబుతున్నారు. వినోద్ కుమార్ బీఆర్ఎస్ లో అతి ముఖ్య నేత. గతంలో ఎంపీగా పనిచేసిన నాయకుడు. దాంతో పాటు కేసీఆర్ కి సన్నిహిత నేత కావడ మరో విశేషం. మరి అంతటి నేత కుటుంబం నిర్వహించే వైద్య కళాశాల వేడుకకు అమిత్ షా వంటి బీజేపీ ఉద్దండుడు వస్తున్నారు అంటే రాజకీయ సమీకరణలు మలుపు తిప్పే సంఘటనగానే చూస్తున్నారు.ఇక బీజేపీ బీఆర్ఎస్ కలవవు అని ఎన్ని చెప్పినా తెలంగాణా రాజకీయం చూస్తే అది అనివార్యం అనిపిస్తుంది అని రాజకీయ విశ్లేషణలు ఉన్నాయి. కాంగ్రెస్ అధికారంలో ఉంది. విపక్షాలు రెండుగా చీలి 2028లో పోటీకి దిగితే కచ్చితంగా యాంటీ ఇంకెంబెన్సీ ఎంత ఉన్నా ఓట్లు అన్నీ అటూ ఇటుగా చీలిపోతాయి. అపుడు కాంగ్రెస్ కే లాభం అని అంటున్నారు. ఈ విషయం రాజకీయంగా ఢక్కామెక్కీలు తిన్న బీజేపీకి బీఆర్ఎస్ కి తెలియనిది కాదు కదా అని అంటున్నారు. మరో వైపు చూస్తే బీఆర్ ఎస్ కి ఈసారి ఎన్నికలు చావో రేవో అన్నట్లుగానే ఉంటాయని అంటున్నారు. రెండోసారి వరుసగా ఓటమి పాలు అయితే కనుక బీఆర్ఎస్ ఎన్నడూ లేనంతగా రాజకీయ సంక్షోభంలో పడుతుంది అని అంటున్నారు. అది బీఆర్ఎస్ సమస్య అయితే బీజేపీకి చూస్తే కాంగ్రెస్ ఎక్కడా ఎదగకూడదు అన్నదే గట్టి సంకల్పం అని గుర్తు చేస్తున్నారు. కాంగ్రెస్ కనుక రాష్ట్రాలలో బలపడి ఎక్కువగా ఎంపీ సీట్లు సాధిస్తే అది జాతీయ స్థాయిలో బీజేపీ అధికారానికి ముప్పు అని అంటున్నారు. అందుకే తాము నేరుగా కట్టడి చేయాల్సిన చోట కట్టడి చేస్తూ లేని చోట్ల మాత్రం మిత్రులను వెతుక్కుని మరీ కాంగ్రెస్ కి బ్రేకులు వేసే వ్యూహాలు బీజేపీ అమలు చేస్తోంది. ఈ విధంగా రాజకీయ విశ్లేషణలు చూసినపుడు బీఆర్ ఎస్ బీజేపీ కలసి పోటీ చేయబోవని అనుకోవడానికి వీలు లేదని అంటున్నారు. అయితే రాజకీయాల్లో వ్యూహాలు అన్నీ సమయానుకూలంగా బయటకు వస్తాయని అంటున్నారు. మరో వైపు చూస్తే బీజేపీ మీద నేరుగా విమర్శలు చేయడాన్ని బీఆర్ఎస్ తగ్గించిందని కూడా విశ్లేషకులు చెబుతున్నారు. మొత్తం మీద అయితే తెలంగాణాలో అమిత్ షా టూర్ ఆసక్తిని పెంచేస్తోంది.

# అర్ధం కానీ జగన్ వ్యూహం



**కడప :** దేశవ్యాప్తంగా దాదాపు అన్ని రాష్ట్రాల్లోనూ కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం వర్సెస్ ఇండియా కూటమి ప్రతిపక్షాల నడుమ తీవ్రమైన రాజకీయ పొలరైజేషన్ నడుస్తోంది. నీట్ క్వశ్చన్ పేపర్ లీకేజీ వ్యవహారం నుంచి పార్లమెంట్ నిరసనల వరకు ప్రతి అంశమూ కేంద్ర వర్సెస్ విపక్షాలుగా ప్రత్యక్ష రణరంగాన్ని తలపిస్తోంది. అయితే, దేశమంతటా ఈ స్థాయిలో రాజకీయ వేడి రగులుతుంటే.. ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం చిత్రమైన రాజకీయ నిశ్శబ్దం అలముకుంది. ఏపీలో కూడా ఎన్డీఏ శ్రేణుల పాలన నడుస్తుండటం, ప్రధాన ప్రతిపక్షంగా వైయస్సార్‌సీపీ ఉండటంతో జాతీయ స్థాయి అంశాలపై ఇక్కడ కూడా రాజకీయ సెగ రావలసి ఉంది. కానీ, ఆ స్థాయి ప్రతిస్పందన ఏపీ రాజకీయాల్లో కనిపించకపోవడం పొలిటికల్ సర్కిల్స్‌లో పెద్ద ఎత్తున చర్చకు దారితీస్తోంది.రాష్ట్రంలో విపక్ష హోదాలో ఉన్న కాంగ్రెస్ పార్టీ క్షేత్రస్థాయిలో నీట్ బాధితులు, విద్యార్థుల పక్షాన నిరసన ప్రదర్శనలు చేపట్టినప్పటికీ, ఏపీలో ఆ పార్టీకి ఉన్న పరిమిత బలమైన కేడర్, ఓటు బ్యాంక్ దృష్ట్యా ఆ ఆందోళనలు అధికార పక్షంపై పెద్దగా ప్రభావం చూపలేకపోయాయి. నిజానికి, వైయస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి ఇది ఓ అరుదైన రాజకీయ అవకాశం. రాష్ట్రంలో లక్షలాది మంది నీట్ అభ్యర్థులు, యువత ఆందోళనలో ఉన్న వేళ, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను నిలదీస్తూ గళమెత్తి ఉంటే ప్రధాన ప్రతిపక్షంగా వైయస్సార్‌సీపీకి మైలేజీ వచ్చి ఉండేది. కానీ, వైయస్సార్‌సీపీ ఈ వ్యవహారంలో ప్రత్యక్షంగా విద్యార్థి పోరాటంలోకి దూకలేకపోయింది.ఢిల్లీ వేదికగా కాంగ్రెస్ నాయకత్వం వహిస్తున్న ప్రతిపక్షాల సమరానికి జగన్ మద్దతు ఇవ్వకపోవడం వెనుక ఆయన సొంత రాజకీయ సమీకరణలు ఉన్నప్పటికీ, కనీసం స్వతంత్రంగా విద్యార్థుల హక్కుల కోసమైనా గళం విప్పకపోవడం రాజకీయ విశ్లేషకులను ఆశ్చర్యపరిచింది. కాంగ్రెస్‌తో జట్టుకట్టడం ఇష్టం లేకపోయినా, యువత బహుళ ప్రయోజనాలతో ముడిపడి ఉన్న ఈ అంశంపై క్షేత్రస్థాయిలో తిరుగుబాటు జెండా ఎగరేసి ఉంటే వైయస్సార్‌సీపీ మళ్లీ జనామోదాన్ని పొందేందుకు అది నైతిక బలాన్ని ఇచ్చేది. కానీ, జగన్ ధైర్యంగా ముందుకు రాకపోవడం వల్ల ఏపీలో అధికార కూటమికి ఎలాంటి విపక్ష నిరసనల సెగ తగలకుండా సురక్షితంగా బయటపడే అవకాశం లభించింది. జాతీయ స్థాయిలో నడుస్తున్న ప్రతిపక్షాల వేవ్‌ను తమకు అనుకూలంగా మలుచుకోవడంలో వైయస్సార్‌సీపీ నాయకత్వం చూపుతున్న 'అతి జాగ్రత్త వైఖరి వెనుక బలమైన కారణాలు ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వంతో నేరుగా విభేదించడం వల్ల రాబోయే రోజుల్లో చట్టపరమైన సమస్యలు ఎదురవుతాయనే భయాలు వైయస్సార్‌సీపీ వైఖరిని నియంత్రిస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో ఢిల్లీ పర్యటనల ద్వారా కేంద్రంతో సత్సంబంధాలు కొనసాగించేందుకు జగన్ యత్నించిన తీరు చూస్తే, ఆయన కేంద్ర అధికార పీఠంతో నేరుగా ఢీ కొట్టేందుకు అస్సలు సిద్ధంగా లేరని స్పష్టమవుతోంది.ఈ రక్షణాత్మక రాజకీయ ధోరణి వల్ల ప్రధానంగా నష్టపోతోంది వైయస్సార్‌సీపీ మాత్రమేనని చెబుతున్నారు. ఒక ప్రతిపక్షంగా ప్రజలు, యువత ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై వీధుల్లోకి వచ్చి పోరాడటంలో విఫలమైనప్పుడు, ఆ రాజకీయ ఖాళీని ఇతర శక్తులు పూరించే ప్రమాదం ఉంది. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన ఘోర పరాజయం నుంచి పార్టీ కేడర్‌ను తిరిగి సమీకరించడానికి, కొత్త ఉత్సాహాన్ని నింపడానికి నీట్ వంటి జాతీయ అంశం ఒక అద్భుతమైన రాజకీయ అస్త్రంగా ఉపయోగపడి ఉండేది. కానీ, ఆ అవకాశాన్ని వైయస్సార్‌సీపీ చేజేతులా వదులుకుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రతిపక్షం నుంచి గట్టి ప్రతిఘటన లేదా రాజకీయ నిరసనలు లేకపోవడంతో, కూటమి ప్రభుత్వం తమ పాలనాజెండాను చాలా సులువుగా అమలు చేయగలుగుతోంది. ఒకవైపు దేశమంతటా విపక్షాలు కేంద్రాన్ని కుదిపేస్తుంటే, ఏపీలో మాత్రం ఎన్డీఏ ప్రభుత్వం ఎటువంటి రాజకీయ ఇబ్బందులు లేకుండా అత్యంత కంఫర్టబుల్ జోన్‌లో కొనసాగుతోంది. జాతీయ స్థాయిలో వస్తున్న అవకాశాలను అందుకోవడంలో, ప్రజా సమస్యలపై అగ్రెసివ్ మైలేజీ సాధించడంలో వైఎస్ జగన్ అనుసరిస్తున్న ఈ వెనకడుగు వైఖరి వైయస్సార్‌సీపీ భవిష్యత్ రాజకీయాలకు ప్రతిబంధకంగా మారే అవకాశం ఉంది. ప్రతిపక్ష హోదాలో ఉంటూ కూడా కేంద్రంతో లేదా అధికార కూటమితో తలపడటానికి వెనుకాడటం వల్ల పార్టీ మద్దతుదారుల్లో తీవ్ర నిరాశ నెలకొంటోంది. రాబోయే రోజుల్లోనైనా జగన్ తన రాజకీయ శైలిని మార్చుకుని, ప్రజల్లో ఉండే సమస్యలపై పోరాట బాట పడతారా లేక ఇదే సైలెంట్ స్ట్రాటజీని కొనసాగిస్తారా అనేది చూడాల్సి ఉంది.

# లింక్డిన్‌లో వైజాగ్ టాప్



**విశాఖపట్టణం :** ఆంధ్రప్రదేశ్‌లో లెక్కలు మారుతున్నాయి.. రాష్ట్రానికి కంపెనీల రాకతో యువతకు ఉద్యోగ అవకాశాలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా విశాఖపట్నానికి ఐటీ కంపెనీలతో పాటుగా డేటా సెంటర్లు, పరిశ్రమలు రావడంతో అక్కడ ఉద్యోగ అవకాశాలు పెరిగాయి. దేశవ్యాప్తంగా ఉద్యోగ అవకాశాలు వేగంగా పెరుగుతున్న నగరాల్లో విశాఖపట్నం టాప్‌లో నిలిచింది. మొన్నటి వరకు 3వ స్థానంలో ఉన్న విజయవాడ 10వ స్థానానికి పడిపోయింది.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొచ్చి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంపై ఫోకస్ పెట్టింది. జిల్లాల వారీగా పరిశ్రమలు, ఐటీ కంపెనీలను తీసుకొస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయి.. దేశవ్యాప్తంగా ఉద్యోగ అవకాశాలు వేగంగా పెరుగుతున్న నగరాల జాబితాలో ఏపీకి స్థానం దక్కింది. ప్రొఫెషనల్ నెట్‌వర్కింగ్ సర్వీస్ లింక్డిన్ సిటీస్ ఆన్ ది రైజ్ పేరుతో విడుదల చేసిన సెకండ్ ఎడిషన్ జాబితాలో విశాఖపట్నం మొదటి స్థానంలో నిలిచింది. లుధియానా రెండో స్థానం, సూరత్ మూడో స్థానం, వడోదర నాలుగో స్థానం, ప్రయాగ్‌రాజ్ ఐదో స్థానం, రాజ్‌కోట్ ఆరో స్థానం, జబల్‌పూర్ ఏడో స్థానం, రాంచీ ఎనిమిదో స్థానం, రాయ్‌పూర్ తొమ్మిదో స్థానం, విజయవాడ పదో స్థానంలో నిలిచాయి. అయితే గతంలో మూడో స్థానంలో నిలిచిన విజయవాడ ఈసారి పదో స్థానానికి పడిపోయింది.లింక్డిన్ న్యూస్, డేటా సైంటిస్టులు రూపొందించిన ఈ ర్యాంకింగ్‌లకు సంబంధించి.. ఉద్యోగ అవకాశాలు, నియామకాలు, టాలెంట్ మైగ్రేషన్ పెరుగుతున్న అభివృద్ధి చెందుతున్న నగరాలను గుర్తిస్తున్నారు. మార్చి 2024 నుంచి ఫిబ్రవరి 2026 మధ్య కాలంలో లక్షలాది లింక్డిన్ సభ్యుల ప్రొఫైల్‌లు, ఉద్యోగ ప్రకటనల నుంచి సేకరించిన డేటా ఆధారంగా ఈ ర్యాంకింగ్స్ రూపొందించారు. గూగుల్ ఏఐ హబ్, రిలయన్స్ డేటా సెంటర్ ప్రాజెక్ట్, ఇన్ఫోసిస్, కాగ్నిజెంట్, యాక్సెంచర్ విస్తరణలతో సహా భారీ స్థాయి పెట్టుబడుల కారణంగా విశాఖపట్నానికి టాప్ ప్లేస్ దక్కింది.అంతేకాదు విశాఖపట్నంలో ఐటీ సేవలు, ఫార్మా, టెక్నాలజీ రంగాలలో ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయి. వీటిలో డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్, లారస్ ల్యాబ్స్, మిరాకిల్ సాఫ్ట్‌వేర్ సిస్టమ్స్ వంటి ప్రధాన సంస్థలు ఉన్నాయి. నగరంలోని ఉద్యోగాలలో 17.1 శాతం రిమోట్ పద్ధతిలో, 5.2 శాతం హైబ్రిడ్ పద్ధతిలో ఉన్నాయి. బలమైన జాబ్ మార్కెట్, ఉద్యోగుల సంఖ్య అధికంగా ఉన్న నగరాలను లింక్డిన్ గుర్తించింది. 10 నాన్ మెట్రో నగరాలకు ర్యాంకులు కేటాయించగా.. ఇక్కడ ప్రతి పోస్టుకు దరఖాస్తుదారుల సంఖ్య రెట్టింపు కంటే ఎక్కువగా ఉందని తేలింది. దేశంలో అభివృద్ధి చెందుతున్న నగరాలు ప్రత్యేంగా, ఆయా రంగాల్లో ఉపాధి అవకాశాలు సృష్టించుకుంటున్నట్లుగా తేలింది. విశాఖలో ఐటీతో పాటుగా ఫార్మా, తయారీ రంగం, డేటా సెంటర్లు, పోర్టు వంటివి కీలకంగా మారాయి. ఇక రెండో స్థానంలో నిలిచిన లుధియానాలో ఉక్కు, విమానయానం, ఆతిథ్య రంగాల్లో ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా దక్కుతున్నాయి. సూరత్ టెక్స్‌టైల్, వజ్రాలు, స్టార్టప్‌లు, రియల్ ఎస్టేట్ ద్వారా విస్తరిస్తోంది. వడోదరలో కెమికల్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, ఎంటర్‌ప్రైజ్ పెట్టుబడులు వస్తున్నాయి. విజయవాడలో కూడా ఐటీ, ఈ-గవర్నెన్స్ కంపెనీల నుంచి ఆసక్తి పెరుగుతోంది. ఈ 10 నగరాల్లోనూ తొలి మూడు నియామకాల్లో ఐటీ సేవలు, టెక్నాలజీ, కన్సల్టింగ్ సర్వీసులు ఉన్నాయి. మిగతా నగరాల్లో బ్యాంకింగ్, ఆర్థిక సేవలు ఉన్నాయని లింక్డిన్ చెబుతోంది.

# గ్రేటర్ ఎన్నికలకు కోర్టు మోకాలడ్డూ




**హైదరాబాద్ :** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సన్నాహాల్లో మునిగి తేలుతున్న అధికార కాంగ్రెస్ ప్రభుత్వానికి తెలంగాణ ఉన్నత న్యాయస్థానం ఊహించని షాక్ ఇచ్చింది. జీహెచ్‌ఎంసీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలపై హైకోర్టు తాత్కాలిక స్టే విధించడంతో అధికార వర్గాల్లో ఒక్కసారిగా కలకలం రేగింది. వార్డుల పునర్విభజన ప్రక్రియను చట్టబద్ధమైన నిబంధనల ప్రకారం పూర్తి చేసి, సరిహద్దులను శాస్త్రీయ పద్ధతిలో పునర్నిర్ణయించేంత వరకు ఎలాంటి ఎన్నికల ప్రక్రియను ముందుకు తీసుకెళ్లవద్దని రాష్ట్ర ప్రభుత్వంతో పాటు రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ధర్మాసనం కఠినంగా ఆదేశించింది. రాజధాని నగరంపై పట్టు సాధిం చాలని భావిస్తున్న హస్తం పార్టీకి ఈ న్యాయపరమైన చిక్కు అతిపెద్ద రాజకీయ ఎదురుదెబ్బగా మారింది.ఈ వివాదానికి ప్రధాన మూలం ఇటీవల జీహెచ్‌ఎంసీ ఆదరాబాదరాగా చేపట్టిన వార్డుల విభజన ప్రక్రియలోని అవకతవకలే. మున్సిపల్ చట్టాల ప్రకారం ప్రతి వార్డు సరిహద్దు నిర్ణయం అనేది కేవలం ఆయా ప్రాంతాల జనాభా ప్రాతిపదికన, సమతుల్యత దెబ్బతినకుండా జరగాలి. కానీ, ప్రస్తుతం చేపట్టిన పునర్విభజన తెలంగాణ మున్సిపాలిటీల చట్టం 2019 లోని సెక్షన్ 6 స్ఫూర్తికి సంపూర్ణంగా విరుద్ధంగా ఉందంటూ పిటిషనర్లు కోర్టు దృష్టికి తీసుకెళ్లిన ఆధారాలు న్యాయస్థానాన్ని సంతృప్తిపరిచాయి. శాస్త్రీయ ప్రాతిపదికను పక్కనబెట్టి, కొన్ని ప్రాంతాలలో జనాభాను విపరీతంగా పెంచేసి, మరికొన్ని చోట్ల కుదించి వేయడం తీవ్రమైన అభ్యంతరాలకు దారితీసింది.ఈ పరిణామం వెనుక అధికార కాంగ్రెస్ పార్టీ రాజకీయ ప్రయోజనం వెతుక్కునే ప్రయత్నం చేసిందనే ఆరోపణలు ఇప్పుడు గట్టిగా బలపడుతున్నాయి. హైదరాబాద్ పరిధిలో సాంప్రదాయకంగా ప్రతిపక్షాలైన బిఆర్ ఎస్ , బీజేపీ , ఎంఐఎం బలంగా ఉన్న ఓటు బ్యాంకులను చెదరగొట్టేందుకే వార్డుల సరిహద్దులను తమకు అనుకూలంగా మార్చుకున్నారనే విమర్శలు క్షేత్రస్థాయి నుంచి వ్యక్తమయ్యాయి. కాంగ్రెస్‌కు ప్రయోజనం చేకూర్చేలా ఓటర్లను, ప్రాంతాలను రాత్రికి రాత్రే అటు ఇటూ మార్చడం ద్వారా ఎన్నికల మేజిక్ చేయాలని చూశారన్న వాదనలకు కోర్టు బ్రేక్ ఇవ్వడంతో ప్రతిపక్షాలకు పెద్ద రాజకీయ ఆయుధం దొరికినట్లయింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికారాన్ని ఉపయోగించి వార్డుల సరిహద్దులను మార్చడం కొత్తేమీ కాకపోయినా, చట్టపరమైన నిబంధనలను, నిబంధన పత్రాలను పూర్తిగా తొక్కిపట్టడం కాంగ్రెస్‌కు రివర్స్ కొట్టింది. ప్రజాభిప్రాయ సేకరణను మమ అనిపించి, శాస్త్రీయ సర్వేలు లేకుండా ప్రక్రియను పూర్తి చేయాలని చూడటమే హైకోర్టులో ప్రభుత్వం ఇరుకున పడటానికి కారణమైంది. ఈ స్టే ఆర్డర్ పరిణామం ప్రతిపక్షాలైన బిఆర్‌ఎస్, బీజేపీలకు రాజకీయంగా పెద్ద ఊరటనిచ్చింది. కాంగ్రెస్ పార్టీ తమ అధికారాన్ని దుర్వినియోగం చేస్తోందని, గెలిచే అవకాశం లేకే అక్రమ మార్గాల్లో వార్డుల విభజన చేసింది అని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు వారికి చక్కటి అవకాశం లభించింది. హైకోర్టు తీర్పును అడ్డం పెట్టుకుని, గ్రేటర్ పరిధిలో కాంగ్రెస్ వైఫల్యాలను, అక్రమ రాజకీయ వ్యూహాలను ఎండగట్టడానికి ప్రతిపక్షాలు సన్నాహాలు చేస్తున్నాయి. ఇది నగర పరిధిలో కాంగ్రెస్ గ్రాఫ్‌ను మరింత దెబ్బతీసే ప్రమాదం లేకపోలేదు.హైదరాబాద్‌ను రాజకీయంగా తమ గుప్పిట్లోకి తీసుకోవాలని వేసిన డెలిమిటేషన్ ఎత్తుగడ కాంగ్రెస్ మెడకే చుట్టుకుంది. ఇప్పుడు కోర్టు ఆదేశాల ప్రకారం మళ్లీ మొదటి నుంచి శాస్త్రీయంగా, పారదర్శకంగా సరిహద్దుల నిర్ణయం చేపట్టాలంటే నెలల సమయం పడుతుంది. ఆలోగా ప్రతిపక్షాల విమర్శల దాడిని తట్టుకోవడం, ప్రజా క్షేత్రంలో ఎదురయ్యే వ్యతిరేకతను అధిగమించడం కాంగ్రెస్ నాయకత్వానికి పెద్ద సవాలుగా మారనుంది.

## పుష్ప బ్రిడ్జిగా స్పెషల్ ఎట్రాక్షన్

**విశాఖపట్టణం :** సోషల్ మీడియా.. అదో నిరంతర ప్రవాహం. వింతల నుంచి విశేషాల వరకూ.. యుద్ధాల నుంచి సినిమాల వరకూ.. నిత్యం ఎన్నో పోస్టులు, వేలకొద్దీ వీడియోలు.. ఇక ఇందులో ప్రకృతి గురించి, ప్రకృతి అందాల గురించి ఎన్నో విశేషాలను షేర్ చేస్తుంటారు. అలా షేర్ చేసిన ఓ వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. చూడగానే వావ్ ఎక్కడిదీ స్పాట్ అని అనకుండా ఉండలేం.. దాని గురించి ఆరా తీసిన తర్వాత ఓసారైనా వెళ్లొద్దామని మనసు లాగడం ఖాయం. అలాంటిదే ఇప్పుడు చెప్పుకోబోయే బ్రిడ్జ్.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలంలోని మోతుగూడెంలో ఉంది ఈ వంతెన. మోతుగూడె ఫోర్‌బే డ్యామ్ బ్రిడ్జ్ అని పిలుస్తారు.లోయర్ సీలేరు హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ ప్రాజెక్టులో భాగంగా మోతుగూడెం ఫోర్‌బే డ్యామ్ నిర్మించారు. చుట్టూ దట్టమైన అడవులు, కొండలు.. పచ్చదనం పరుచుకున్న వాతావరణం మధ్య ఉన్న ఈ డ్యామ్.. ప్రకృతి ప్రియులను, పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తోంది. ఈ ప్రకృతి అందాలను చూసి సినిమా డైరెక్టర్లు కూడా ఇక్కడ షూటింగ్‌లు జరుపుతుంటారు. ఇక పుష్ప సినిమా షూటింగ్ తర్వాత.. మోతుగూడెం ఫోర్ బే డ్యామ్ బ్రిడ్జ్ కాస్తా..పుష్ప బ్రిడ్జ్‌గా పేరు తెచ్చుకుంది. పుష్ప సినిమాలోని కొన్ని సీన్లను ఇక్కడ చిత్రీకరించడంతో.. సినిమాతో పాటుగా ఈ ప్రాంతం కూడా బాగా పాపులర్ అయ్యింది. అప్పటి నుంచి ఇక్కడికి వచ్చే పర్యాటకుల సంఖ్య మరింత పెరిగింది.చుట్టూ లక్కవరం అటవీ ప్రాంతం, పచ్చని కొండల మధ్య సాగే మార్గం.. ఇక్కడ స్పెషల్ అట్రాక్షన్‌గా నిలుస్తున్నాయి. ఇక కరెంట్ ఉత్పత్తి తర్వాత డొంకరాయి డ్యామ్ నుంచి పవర్ కెనాల్ ద్వారా నీరు ఈ డ్యామ్‌లోకి చేరుతుంది. ఆ సమయంలో ఈ డ్యామ్ మరింత అందాన్ని సంతరించుకుంటుంది. ఇక ఈ ఫోర్ బే డ్యామ్‌కు కొద్ది దూరంలో పొల్లూరు వాటర్ ఫాల్స్ ఉన్నాయి. దీంతో ఈ రెండింటినీ కలిపి చూసేందుకు ఎక్కువమంది పర్యాటకులు వస్తుంటారు. అయితే నీటిని విడుదల చేసిన సమయంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

## 85 జూలై 24న జరగాల్సిన ఓయూ పరిధిలోని అన్ని పరీక్షలు వాయిదా

**హైదరాబాద్ :** ఉస్మానియా యూనివర్సిటీ (ఓయూ) కీలక నిర్ణయం తీసుకుంది. జూలై 24, శుక్రవారం నాడు జరగాల్సిన అన్ని పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. విద్యార్థి సంఘాలు రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌కు పిలుపునివ్వడంతో వర్సిటీ అధికారులు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు.నీట్ యూజీ 2026 పేపర్ లీకేజీ వ్యవహారం, కేంద్ర ప్రభుత్వ విద్యా విధానాలకు వ్యతిరేకంగా ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యూఐ, పీడీఎస్‌యూ వంటి వామపక్ష, కాంగ్రెస్ అనుబంధ విద్యార్థి సంఘాలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో బంద్‌కు పిలుపునిచ్చాయి. ఢిల్లీలో 'ఛలో పార్లమెంటు మార్చ్' నిర్వహించిన విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేశారని ఆరోపిస్తూ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.ఈ నేపథ్యంలో, బంద్ కారణంగా విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకూడదనే ఉద్దేశంతో అధికారులు ముందుస్తు జాగ్రత్త చర్యగా పరీక్షలను వాయిదా వేశారు. ఈ నిర్ణయం ఓయూ పరిధిలోని అన్ని అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులకు వర్తిస్తుందని స్పష్టం చేశారు. ఇదే క్రమంలో జేఎన్‌టీయూ-హైదరాబాద్ వంటి ఇతర విద్యాసంస్థలు కూడా ముందుజాగ్రత్త చర్యలు చేపట్టాయి.పరీక్షల వాయిదాతో విద్యార్థులకు తాత్కాలికంగా ఊరట లభించినప్పటికీ, అకడమిక్ క్యాలెండర్‌పై దీని ప్రభావం పడనుంది. వాయిదా పడిన పరీక్షల తదుపరి షెడ్యూల్‌ను త్వరలోనే ప్రకటిస్తామని వర్సిటీ అధికారులు వెల్లడించారు.

## పార్టీ మార్పు వార్తలపై మల్లారెడ్డి క్లారిటీ

**హైదరాబాద్ :** రాజకీయ వర్గాల్లో గత కొద్ది రోజులుగా తన పార్టీ మార్పుపై వస్తున్న ప్రచారానికి బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి మల్లారెడ్డి చెక్ పెట్టారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పుట్టినరోజు వేడుకల్లో అత్యంత ఉత్సాహంగా పాల్గొన్న ఆయన, తాను బీఆర్ఎస్‌ను వీడి వేరే పార్టీలోకి వెళ్తున్నానంటూ వస్తున్న వార్తలన్నీ కేవలం నిరాధారమైన ప్రచారమేనని స్పష్టం చేశారు.తాను పార్టీ మారుతున్నాననే రూమర్లను నిజమని నమ్మి ఒక అభిమాని తన సొంత రక్తంతో లేఖ రాయడం తనను ఎంతగానో కలచివేసిందని మల్లారెడ్డి తెలిపారు. త్వరలోనే ఆ అభిమానిని నేరుగా కలిసి మాట్లాడతానని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం కేటీఆర్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ... కేటీఆర్ 125 ఏళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు. రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రానికి కేటీఆరే ముఖ్యమంత్రి కాబోతున్నారని, ఆయన్ను సీఎం పీఠంపై చూడటమే తన ప్రధాన లక్ష్యమని మల్లారెడ్డి వ్యాఖ్యానించారు.

## 20 ఏళ్లుగా అమెరికాలో ఉద్యోగం.. ఇంజినీర్‌పై తెలంగాణ ప్రభుత్వం విచారణ!

**హైదరాబాద్ :** తెలంగాణ రోడ్లు, భవనాల (ఆర్ అండ్ బి) శాఖలో పనిచేస్తున్న ఓ ఇంజనీర్, ప్రభుత్వ ముందస్తు అనుమతి లేకుండా దాదాపు రెండు దశాబ్దాలుగా అమెరికాలో ఉద్యోగం చేస్తున్నట్లు వెలుగులోకి వచ్చింది. ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం, సదరు ఇంజనీర్‌పై క్రమశిక్షణా చర్యలకు ఉపక్రమించింది. శాఖాపరమైన రికార్డుల్లో ఇప్పటికీ ఉద్యోగిగా కొనసాగుతున్న ఆయనపై సమగ్ర విచారణకు ఆదేశాలు జారీ చేసింది.ఆర్ అండ్ బి శాఖలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా ఉన్న సీహెచ్ రవి, 2006లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సమయంలో తొలిసారిగా అమెరికా వెళ్లారు. అనంతరం 2011లో స్వల్ప కాలం పాటు తిరిగి వచ్చి, 2012లో మళ్లీ అమెరికాకు వెళ్లారు. అప్పటి నుంచి ఆయన విధులకు హాజరుకావడం లేదు. గత కొన్ని ఏళ్లుగా ఆయన వేతనం తీసుకోనప్పటికీ, ఆర్ అండ్ బి శాఖ అధికారిక రికార్డుల్లో ఆయన పేరు ఇప్పటికీ ఉద్యోగిగా కొనసాగుతుండటం గమనార్హం.ప్రభుత్వ సర్వీస్ నిబంధనల ప్రకారం, విదేశాల్లో ఉద్యోగం చేయాలంటే ప్రభుత్వం నుంచి ముందస్తు అనుమతి పొందడం తప్పనిసరి. అలాగే, నిబంధనల మేరకు గరిష్ఠంగా ఐదేళ్ల వరకు మాత్రమే దీర్ఘకాలిక సెలవు పొందేందుకు అవకాశం ఉంటుంది. అయితే, రవి ఎలాంటి అనుమతులు పొందకుండానే విదేశాల్లో ఉద్యోగంలో చేరి సేవా నిబంధనలను ఉల్లంఘించారని అధికారులు గుర్తించారు.ఈ నేపథ్యంలో, అనధికారిక గైర్హాజరు, సర్వీస్ నిబంధనల ఉల్లంఘన ఆరోపణలపై ప్రభుత్వం శాఖాపరమైన విచారణకు ఆదేశాలు జారీ చేసింది. అయితే, ఈ ఆరోపణలకు సంబంధించి రవి నుంచి ఇప్పటివరకు ఎలాంటి లిఖితపూర్వక వివరణ అందలేదని తెలుస్తోంది.

## తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

**కరీంనగర్ :** కరీంనగర్ లోఎల్ నినో ప్రభావంతో జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశించారు. మిషన్ భగీరథతో పాటు ఇతర తాగునీటి సరఫరా వ్యవస్థల్లో ఎలాంటి అంతరాయం కలగకుండా సమన్వయంతో పనిచేయాలని సూచించారు.శుక్రవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, మిషన్ భగీరథ, పబ్లిక్ హెల్త్ అధికారులతో తాగునీటి సరఫరాపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగరపాలక సంస్థలు, మున్సిపాలిటీల పరిధిలో రోజువారీ నీటి అవసరాలు, సరఫరా పరిస్థితులు, నీటి పొదుపు కోసం చేపడుతున్న చర్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఎక్కడైనా తాగునీటి పైపులైన్లకు లీకేజీలు ఏర్పడితే వెంటనే మరమ్మతులు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. వార్డుల వారీగా పనిచేస్తున్న బోర్లు, వినియోగంలో లేని బోర్లను గుర్తించి అవసరమైన మరమ్మతులు చేసి తిరిగి వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు.కార్పొరేషన్ పరిధిలోని కొత్తపల్లి-ఎలగందుల, బొమ్మకల్, విద్యారణ్యపురి, అలుగునూరు, చింతకుంట ప్రాంతాలతో పాటు ఇటీవల విలీనమైన గ్రామాల్లో తాగునీటి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ పేర్కొన్నారు. అలాగే జమ్మికుంట, హుజురాబాద్, చొప్పదండి మున్సిపాలిటీలు, గంగాధర, గన్నేరువరం మండలాల్లో నీటి అవసరాలు, వినియోగం, సరఫరా పరిస్థితులను సమీక్షించారు.ఎల్ఎండీ రిజర్వాయర్‌లో నీటి నిల్వలను ప్రతిరోజూ పర్యవేక్షించాలని, డెడ్ స్టోరేజ్ పరిస్థితి ఏర్పడకముందే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గన్నేరువరం మండలంలోని హనుమాజిపల్లి జంగంపల్లి ప్రాంతాల్లో నెలకొన్న తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని సూచించారు.

## బిజినెస్

### సీఎంఆర్‌లో డిస్కౌంట్లు భళా..!

**ఆడి–శ్రావణం క్రేజీ కేజీ సేల్, కాంబో ఆఫర్స్ ఎన్నో..**

**అన్ని వర్గాలకు అందుబాటు ధరలలో వస్త్రాలు**



రామచంద్రాపురం, జూలై 24 : వినియోగదారుల కోసం సీఎంఆర్ షాపింగ్ మాల్ క్రేజీ కేజీ సేల్స్, కాంబో ఆఫర్స్‌ని తీసుకొచ్చింది. ఆడి–శ్రావణం ప్రత్యేకంగా అతిపెద్ద డిస్కౌంట్ సేల్స్‌ను ప్రారంభించడం జరిగిందని షాపింగ్ మాల్ ఎండీ వెంకటరమణ, క్లస్టర్ మేనేజర్ దయానంద్ తెలిపారు. సీఎంఆర్‌లో అన్ని వర్గాలవారు మెచ్చే వస్త్రాలు అందుబాటులో ఉంటాయన్నారు. పిల్లలు, పెద్దలకు కావాల్సిన బట్టలు సరసమైన ధరలకే లభిస్తాయని వివరించారు. పండుగలు, వివాహాది శుభకార్యాలన్నింటికీ కుటుంబ సమేతంగా విచ్చేసి షాపింగ్ చేసుకోవచ్చని వెల్లడించారు. లేటెస్ట్ ట్రెండ్, కస్టమర్ల అభిరుచి మేరకు నూతన డిజైన్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. పట్టు, ఫ్యాన్సీ, స్పెషల్ ఫ్యాన్సీ చీరలతోపాటు చుడిదార్ డ్రెసెస్, మెటీరియల్స్, మెన్స్‌వేర్, ఉమెన్స్‌వేర్, గర్ల్స్‌వేర్, బాయ్స్‌వేర్‌లో సరికొత్త ఆఫర్స్ ఉన్నాయని పేర్కొన్నారు. పట్టు సారీస్‌లో రూ.1,499 నుంచి రూ.4,499 వరకు, ఫ్యాన్సీ సారీస్‌లో రూ.299 నుంచి రూ.1,499 వరకు కేజీ సేల్ ఉందన్నారు. అలాగే కాంబో ఆఫర్స్‌తోపాటు వన్ ప్లస్ వన్ ఆఫర్స్ అప్ టూ 61శాతం డిస్కౌంట్‌ను వినియోగదారుల కోసం ఇస్తున్నారు. బీహెచ్ఈఎల్ చౌరస్తాలో ఉన్న సీఎంఆర్ షాపింగ్ మాల్‌ను కొనుగోలుదారులు సందర్శించి ఈ క్రేజీ ఆఫర్స్‌ను సొంతం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కస్టమర్ల వాహనాలకు పార్కింగ్ సౌకర్యం కూడా ఉందని బీహెచ్ఈఎల్ సీఎంఆర్ స్టోర్ మేనేజర్ రమేశ్, అసిస్టెంట్ మేనేజర్ రాజేశ్ తెలిపారు.

### రూ.2 వేలు దిగిన పుత్తడి..
### రూ.5 వేలు తగ్గిన కిలో వెండి

న్యూఢిల్లీ, జూలై 24 : బంగారం ధరలు క్రమంగా దిగొస్తున్నాయి. ట్రేడర్లు ప్రాఫిట్ బుకింగ్‌నకు మొగ్గుచూపడంతోపాటు అంతర్జాతీయ మార్కెట్లో అతి విలువైన లోహాలకు డిమాండ్ పడిపోవడంతో దేశీయంగా ధరలు తగ్గుముఖం పట్టాయి. శుక్రవారం న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల గోల్డ్ ధర ఏకంగా రూ.2 వేలు తగ్గి రూ.1,47,200 పరిమితమైంది. వరుసగా రెండు రోజుల్లో గోల్డ్ ధర రూ.3 వేల వరకు తగ్గినట్టు అయింది. బంగారంతోపాటు వెండి ధరలు భారీగా పడిపోయాయి. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు అంతంత మాత్రంగానే నమోదు కావడంతో కిలో వెండి ఏకంగా రూ.5 వేలు తగ్గి రూ.2,24,700కి దిగొచ్చింది. అంతకుముందు ఇది రూ.2,29, 700గా ఉన్నది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 4,063.70 డాలర్లు పలుకగా, వెండి 58.59 డాలర్ల వద్ద స్థిరంగా ఉన్నాయి. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా ఇంధన ధరలు రాకెట్ వేగంతో దూసుకుపోతుండటంతో మదుపర్లు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారని, గత ఐదు రోజుల్లో వీటి ధరలు 12 శాతం ఎగబాకాయని విశ్లేషకులు వెల్లడించారు.

# అమ్మకాల ఒత్తిడిలో మార్కెట్లు..
# ఐదోరోజూ క్షీణించిన సూచీలు

ఈ వారం సెన్సెక్స్ 2,092, నిఫ్టీ 567 పాయింట్లు డౌన్

**ముంబై :** దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం మొత్తం నష్టాలకే పరిమితమయ్యాయి. చివరి రోజైన శుక్రవారం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 331.62 పాయింట్లు లేదా 0.43 శాతం పడిపోయింది. ఒకానొక దశలోనైతే 916.96 పాయింట్లు దిగజారింది. అయితే తిరిగి కోలుకొని 76,059.77 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 102.15 పాయింట్లు లేదా 0.43 శాతం పతనమై 23,767.45 వద్ద నిలిచింది. దీంతో గత 5 రోజుల్లో సెన్సెక్స్ 2,091.68 పాయింట్లు, నిఫ్టీ 566.85 పాయింట్లు క్షీణించినెట్టైంది. కాగా, అమెరికా వాణిజ్య సుంకాలు, పశ్చిమాసియా ఉద్రిక్తతలు.. మదుపర్లను పెట్టుబడుల ఉపసంహరణల దిశగా నడిపిస్తున్నాయని మార్కెట్ నిపుణులు ట్రేడింగ్ సరళిని విశ్లేషిస్తున్నారు. ముఖ్యంగా అమెరికా–ఇరాన్ యుద్ధంతో అంతర్జాతీయ మార్కెట్‌లో మళ్లీ పెరుగుతున్న ముడి చమురు ధరలు.. మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీస్తున్నాయి.

**సెన్సెక్స్ షేర్లలో..**

ఎటర్నల్, మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్ ఫైనాన్స్, భారతీ ఎయిర్‌టెల్, ఏషియన్ పెయింట్స్, ఇన్ఫోసిస్ షేర్లు నిరాశపర్చాయి. ఈ ఆర్థిక సంవత్సరం (2026–27) తొలి త్రైమాసికానికి (ఏప్రిల్–జూన్)గాను ఇన్ఫోసిస్ ప్రకటించిన ఆర్థిక ఫలితాలు మదుపర్లను మెప్పించలేదు. దీంతో కంపెనీ షేర్ విలువ 1 శాతం నష్టపోయింది. అయితే బీఎస్ఈ



మిడ్‌క్యాప్ సూచీ 0.46 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.08 శాతం చొప్పున పెరుగడం విశేషం. ఇక రంగాలవారీగా.. ఆటో, టెలికాం, విద్యుత్తు, చమురు–గ్యాస్, రియల్టీ, మెటల్, ఐటీ, పీఎస్‌యూ బ్యాంక్ సూచీలు నష్టాలకే పరిమితమయ్యాయి.

**నష్టాలకు ప్రధాన కారణాలు**

పశ్చిమాసియా సంక్షోభం
పెరుగుతున్న ముడి చమురు ధరలు
తరలిపోతున్న విదేశీ పెట్టుబడులు
బడా షేర్లలో అమ్మకాల ఒత్తిడి
పేలవమైన త్రైమాసిక ఆర్థిక ఫలితాలు
అమెరికా వాణిజ్య సుంకాలు

# ఫుడ్ డెలివరీలోకి ఫ్లిప్‌కార్ట్!

**న్యూఢిల్లీ :** దేశీయ ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ మార్కెట్‌లోకి రావడానికి వాల్‌మార్ట్‌కు చెందిన ఈ–కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ సిద్ధమవుతున్నది. ఇందులో భాగంగానే వచ్చే నెల రోజుల్లో ఓ పైలట్ ప్రాజెక్ట్‌ను చేపట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆ తర్వాతే సాధ్యాసాధ్యాలను పరిశీలించి దేశవ్యాప్తంగా సేవల విస్తరణపై ఓ నిర్ణయం తీసుకుంటామని ఫ్లిప్‌కార్ట్ గ్రూప్ సీఈవో కల్యాణ్ కృష్ణమూర్తి ఓ ప్రముఖ జాతీయ దినపత్రికకు స్పష్టం చేశారు. ఇదే జరిగితే ఈ రంగంలో ఇప్పటికే ఉన్న జొమాటో, స్విగ్గీ వంటి ప్రధాన సంస్థలకు ఫ్లిప్‌కార్ట్ నుంచి గట్టి పోటీ ఎదురవగలదన్న అంచనాలున్నాయి. కాగా, ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ మార్కెట్‌లో ఇప్పుడున్న పోటీని తట్టుకొని ఓ కొత్త సంస్థ నిలదొక్కుకొనే వీలుందనుకుంటున్నారా? అన్న ప్రశ్నకు కృష్ణమూర్తి బదులిస్తూ.. సరైన ప్రణాళికతో, బలమైన నెట్‌వర్క్, శ్రామిక శక్తితో విజయం లభించగలదన్న ధీమాను వ్యక్తం చేశారు.

ఇక గత ఆర్థిక సంవత్సరం దాదాపు 9 బిలియన్ డాలర్లుగా ఉన్న భారతీయ ఫుడ్ డెలివరీ మార్కెట్ విలువ.. 2029–30నాటికి 25 బిలియన్ డాలర్లకు చేరవచ్చని జెఫ్రీస్ అంచనా. జొమాటో, స్విగ్గీల ప్రాబల్యం ఎక్కువగా ఉన్న ఈ రంగంలోకి ర్యాపిడో వోస్లీ, ఓఎన్డీసీ ఆధారిత వేదికలూ వచ్చాయి. ఇక తీవ్రమవుతున్న పోటీ నేపథ్యంలో కస్టమర్లను ఆకట్టుకొనేందుకు 10 నిమిషాల్లోనే డెలివరీ అంటూ స్విగ్గీ బోల్ట్, బ్లింకిట్ బిస్ట్రో, జెప్టో కేఫ్‌ల వంటి సర్వీసులెన్నో పరిచయమయ్యాయి. మొత్తానికి ఫ్లిప్‌కార్ట్ ఎంట్రీ ఆలోచనలు




ఇప్పుడు ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ మార్కెట్‌లో మిక్కిలి ప్రాధాన్యతాంశంగా నిలుస్తున్నాయి.

# సిరీస్‌పై భారత్ గురి

**హరారే:** శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో భారత జట్టు తొలి టి20 సిరీస్ సాధించేందుకు విజయం దూరంలో ఉంది. ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనల్లో శ్రేయస్ అయ్యర్ కెప్టెన్సీలో భారత జట్టుకు ఒక్క గెలుపు కూడా దక్కలేదు. జింబాబ్వేతో మూడు మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో భాగంగా తొలి మ్యాచ్‌లో టీమిండియా అలవోక విజయం అందుకుంది. అదే జోరును రెండో మ్యాచ్‌లోనూ కొనసాగించాలని శ్రేయస్ అయ్యర్ బృందం పట్టుదలతో ఉంది. ఈ మ్యాచ్‌లో భారత్ గెలిస్తే మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్‌ను 2--0తో సొంతం చేసుకుంటుంది. తొలి మ్యాచ్‌లో టీనేజ్ సంచలనం వైభవ్ సూర్యవంశీ మెరుపు బ్యాటింగ్‌తో అర్ధ సెంచరీ సాధించాడు. ఓపెనర్ అభిషేక్ శర్మ విఫలమైనా... ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్ నిలకడగా రాణించి భారత్‌కు 40 బంతులు మిగిలి ఉండగానే విజయాన్ని కట్టబెట్టారు. మరోవైపు జింబాబ్వే జట్టుకు బ్యాటర్లు ఆశించిన స్కోరును అందించలేకపోయారు. కెప్టెన్ సికందర్ రజాతోపాటు బెన్ కరన్, బ్రియాన్ బెనెట్, డియాన్ మైర్స్ తక్కువ స్కోరుకే వెనుదిరిగారు. ర్యాన్ బర్ల్, వెస్లీ మధెవెరె, మరుమని కాస్త పోరాడటంతో జింబాబ్వే స్కోరు 100 దాటగలిగింది. జింబాబ్వే బౌలర్లు ముజరబాని, ఎన్‌గరావా ఫర్వాలేదనిపించినా.. జింబాబ్వే నిర్దేశించిన లక్ష్యం



తక్కువగా ఉండటంతో ఆ జట్టుకు ఓటమి తప్పలేదు. ఈ మ్యాచ్‌లో గెలిచి సిరీస్‌లో నిలవాలంటే అటు బ్యాటింగ్‌తోపాటు ఇటు బౌలింగ్‌లో జింబాబ్వే రాణించాల్సి ఉంటుంది.

# చరిత్ర సృష్టించిన జోస్ బట్లర్.. క్రిస్ గేల్ రికార్డు బ్రేక్

ఇంగ్లండ్ మాజీ కెప్టెన్, మాంచెస్టర్ సూపర్ జెయింట్స్ స్టార్ ఆటగాడు జోస్ బట్లర్ టీ20 క్రికెట్‌లో అరుదైన ఘనత సాధించాడు. టీ20 ఫార్మాట్( అంతర్జాతీయ క్రికెట్ ం లీగ్ క్రికెట్)లో అత్యధిక పరుగులు చేసిన రెండో ఆటగాడిగా బట్లర్ నిలిచాడు. 'ది హండ్రెడ్ 2026' టోర్నీలో భాగంగా లార్డ్స్ వేదికగా లండన్ స్పిరిట్‌తో జరిగిన మ్యాచ్‌లో బట్లర్ 10 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద ఈ అరుదైన ఫీట్ నమోదు చేశాడు. ఇప్పటివరకు బట్లర్ టీ20ల్లో 14,572 పరుగులు చేశాడు. ఇంతకుముందు ఈ రికార్డు యూనివర్సల్ బాస్ క్రిస్ గేల్(14,562) పేరిట ఉండేది. తాజా మ్యాచ్‌తో గిల్‌ను బట్లర్ వెనక్కి నెట్టాడు. ఈ జాబితాలో వెస్టిండీస్ మాజీ కెప్టెన్ కీరన్ పొలార్డ్(14,803 పరుగులు) అగ్రస్థానంలో ఉన్నాడు. పొలార్డ్ కంటే బట్లర్ కేవలం 231 పరుగుల దూరంలో మాత్రమే ఉన్నాడు. రాబోయే మ్యాచ్‌ల్లో ఇదే జోరు కొనసాగిస్తే పొలార్డ్‌ను దాటేసి నంబర్–1 స్థానానికి చేరుకోవడం ఖాయంగా కనిపిస్తోంది. ఇక ఈ మ్యాచ్ విషయానికి వస్తే.. లండన్ స్పిరిట్‌పై 7 పరుగుల తేడాతో మాంచెస్టర్ సూపర్ జెయింట్స్ సంచలన విజయం సాధించింది. లుత బ్యాటింగ్ చేసిన మాంచెస్టర్ సూపర్ జెయింట్స్ నిర్ణీత ఓవర్లలో 138 పరుగులకు ఆలౌటైంది. అనంతరం 139 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన లండన్ స్పిరిట్‌ను మాంచెస్టర్ 131 పరుగులకే కట్టడి చేసింది.



## స్పోర్ట్స్


### పారా స్విమ్మింగ్ ఫైనల్లో కార్తిక్, ఇమామ్..
### 90 కిలోలపై సందిగ్ధంలో ఒలింపిక్ విజేత..!



గ్లాస్గో వేదికగా జరుగుతున్న కామన్వెల్త్ గేమ్స్‌లో భారత స్విమ్మర్లు అదరగొడుతున్నారు. పురుషుల పారా 100 మీటర్ల ఫ్రీ స్టయిల్ ఎస్ 13 విభాగంలో కార్తిక్ బుడిగిన అలీ ఇమామ్‌లు ఫైనల్‌కు దూసుకెళ్లారు. పురుషుల 50 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ పోటీలో సత్తా చాటిన శ్రీహరి నటరాజ్ సెమీస్‌లో అడుగుపెట్టాడు. అయితే.. వెయిట్‌లిఫ్టింగ్‌లో మీరాబాయి చాను మూడోసారి పసిడి పట్టేస్తుందనుంటే.. 90 కిలోల విభాగంలో 100 శాతం తన సామర్థ్యాన్ని వినియోగించలేని పేర్కొంది. తొలిసారి కామన్వెల్త్ క్రీడల్లో పోటీపడుతున్న కార్తిక్ బుడిగిన, అలీ ఇమామ్‌లో ఈత కొలనులో మెరిశారు. చూపు సరిగా లేని ఇద్దరూ పారా స్విమ్మింగ్ పోటీల్లో ఫైనల్ చేరి పతకానికి అడుగుదూరంలో నిలిచారు. కార్తిక్ 57.10 సెకన్లలో స్విమ్ పూర్తి చేసి మూడో స్థానంలో నిలవగా.. ఎస్ 12 ఈవెంట్లో 1:05.32 టైమింగ్‌తో అలీ ఫైనల్ బెర్తు సాధించాడు. పురుషుల 50 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ పోటీలో ఫైనల్ బెర్తు కోసంశ్రీహరి నటరాజ్ శనివారం ఉదయం 12:30గంటలకు ఈతకు సిద్ధమవ్వనున్నాడు.

**మీరాబాయి డౌటే**

ఒలింపిక్ విజేత మీరాబాయి చాను మాత్రం తాను 90 కిలోల విభాగంలో పూర్తి స్థాయిలో పోటీపడనని తేల్చి చెప్పింది. జపాన్ వేదికగా త్వరలో జరుగబోయే ఆసియా క్రీడలే లక్ష్యంగా పెట్టుకున్న తాను కామన్వెల్త్‌లో 100 శాతం తన శక్తిని ఉపయోగించబోనని స్పష్టం చేసిందీ పవర్ లిఫ్టర్. ఎందుకంటే.. గ్లాస్గోలో తను 48 కిలోల విభాగంలో తలపడుతోంది. ఆసియా క్రీడల్లో 49 కిలోల కేటగిరీలో బరువులు ఎత్తాలనుకుంటున్న చాను కామన్వెల్త్ పోటీల్లో అనవసరంగా రిస్క్ వద్దనే ఉద్దేశంతో ఉంది.



# అజ్ఞాతం వైపు ప్రయాణం



నారా రోహిత్ నటిస్తున్న సైకలాజికల్ హారర్ థ్రిల్లర్‌కి 'కపాలి' అనే టైటిల్‌ని ఖరారు చేశారు. ఉపశీర్షిక. హన్సిక మోత్వాని కథానాయిక. రామ్ గన్ని దర్శకుడు. కళ్యాణ చక్రవర్తి మంథినా,భానుకిరణ్ ప్రతాప నిర్మాతలు. శనివారం నారా రోహిత్ పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం ఈ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్‌తో పాటు టైటిల్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఇంటెన్స్ ఎమోషన్స్‌తో కనిపిస్తున్న నారా రోహిత్‌ని ఈ పోస్టర్‌లో చూడొచ్చు. కనిపించని ఓ శక్తితో పోరాడుతున్నట్టు ఈ పోస్టర్‌లో ఆయన కనిపిస్తున్నాడు. ఆయన తలపై కిరీటంలా కనిపిస్తున్న వంకర చెట్టు కొమ్మలు కథలోని మిస్టికల్ కనెక్షన్‌ని సూచిస్తున్నాయి. నేపథ్యంలో కనిపిస్తున్న ప్రాచీన చిహ్నాలతో కూడిన డిజైన్ క్షుద్రశక్తులు, పురాణ నేపథ్యాన్ని, పోస్టర్‌లో ఎర్రటి కళ్ళతో కనిపిస్తున్న భయానక స్త్రీ రూపం అతీంద్రియ శక్తిని సూచిస్తున్నాయి. పోలీసులకు, అతీంద్రియ శక్తులకు మధ్య సాగే పోరాటమే ఈ సినిమా కథాంశమని పోస్టర్ చెబుతున్నది. ఈ చిత్రానికి సమర్పణ: విజయ్‌కృష్ణ లింగమనేని, నిర్మాణం: సప్తఅశ్వ మీడియా వర్క్స్.

# 'రామాయణ' సాంకేతికంగా ఓ సవాల్

దేశంలోనే అత్యంత భారీగా తెరకెక్కుతున్న చిత్రం.. పాన్ ఇండియా పౌరాణిక దృశ్యకావ్యం 'రామాయణ'. రణబీర్‌కపూర్ రాముడిగా, సాయిపల్లవి సీతగా, కన్నడ అగ్ర నటుడు యశ్ రావణుడిగా, కాజల్ మండోదరిగా, సన్నీడియోల్ హనుమంతుడిగా ప్రధాన పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి నితేశ్ తివారీ దర్శకుడు. నమిత్ మల్హోత్రా రెండు భాగాలుగా నిర్మిస్తున్న ఈ ఫ్రాంచైజీలోని తొలి భాగం ఈ ఏడాది దీపావళికి విడుదల కానున్నది. ఈ సందర్భంగా ఈ సినిమా గ్లోబల్ ప్రమోషన్స్ జోరందుకున్నాయి. అమెరికాలో జరుగుతున్న 'శాన్ డియాగో కామిక్-కాన్ 2026' వేడుకల్లో ఈ సినిమా బృందం సందడి చేసింది. ఇందులో భాగంగా ఇందులో రాముడిగా నటిస్తున్న రణ్‌బీర్ కపూర్‌పై రావణపాత్రధారి యశ్ ప్రశంసలు కురిపించారు. 'రాముడి పాత్ర పోషించడం చాలా కష్టం. భావోద్వేగాలతో కూడుకున్న పాత్ర అది. రణబీర్ ఆ పాత్రను చాలా గొప్పగా పోషించాడు. ఈ సినిమా చూసినప్పుడు అతని నిబద్ధత కనిపిస్తుంది. సంకల్పబలం ఉంటే తప్ప ఇలాంటి సినిమాలను నిర్మించలేం. ఈ సినిమా ప్రయాణంలో జీవితానికి కావాల్సిన ఎన్నో విషయాలను తెలుసుకున్నాను. సాంకేతికంగా ఈ సినిమా ఓ సవాల్. మంచి టీమ్ కుదరడంతో అన్నీ కలిసొచ్చాయి. మా శక్తివంచన లేకుండా కృషి చేశాం' అని తెలిపారు యశ్. ఇదిలావుంటే ఈ నెల 24న విడుదల కావాల్సిన ఈ సినిమా ట్రైలర్ వాయిదా పడింది. ట్రైలర్‌ని కూడా అంతర్జాతీయ స్థాయిలో విడుదల చేయాలని సంకల్పించామని, అందుకే వాయిదా వేశామని, త్వరలోనే ట్రైలర్‌ని విడుదల చేస్తామని మేకర్స్ తెలిపారు.

# పురాణ కథకు సై?



'నేను శైలజ, ఉన్నది ఒక్కటే జిందగీ, భర్త మహాశయులకు విజ్ఞప్తి' వంటి చిత్రాలను తెరకెక్కించి, దర్శకుడుగా తనదైన మార్క్‌తో ప్రతిభ చూపారు కిషోర్ తిరుమల. తాజాగా ఆయన ఓ ఉమెన్ సెంట్రిక్ స్టోరీని రెడీ చేస్తున్నారని, పురాణాలకు సంబంధించిన అంశాలు కూడా ఈ కథలో ఉంటాయని సమాచారం. ఈ సినిమాలోని లీడ్ రోల్‌కు సాయి పల్లవిని అనుకుంటున్నారని, ఆమెకు ఇటీవలే కిషోర్ కథ కూడా వినిపించారని తెలిసింది. స్టోరీ లైన్ నచ్చడంతో ఈ సినిమా చేసేందుకు సాయి పల్లవి కూడా ప్రాథమికంగా అంగీకారం తెలిపారట. ఫుల్ స్క్రిప్ట్ పూర్తయ్యాక ఫైనల్ నరేషన్ విని, ఈ చిత్రం చేయడంపై ఓ నిర్ణయం తీసుకోనున్నారట సాయి పల్లవి. మరోవైపు హిందీ 'రామాయణ'లో సీతగా నటించారామె. తమిళంలో ధనుష్ హీరోగా చేస్తున్న సినిమాలో హీరోయిన్ గా నటిస్తున్నారు.

# రణబాలి కోసం కఠోర సాధన



అగ్ర హీరో విజయ్ దేవరకొండ 'రణబాలి' చిత్రం సెప్టెంబర్‌లో ప్రేక్షకుల ముందుకురానుంది. సతీమణి రష్మిక మందన్నతో కలిసి ఆయన నటించిన ఈ సినిమా కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. వివాహానంతరం రాబోతున్న తొలి సినిమా అదే కావడం మరింత హైప్‌ని క్రియేట్ చేస్తున్నది. ఈ పీరియాడిక్ డ్రామా కోసం విజయ్ దేవరకొండ గుర్రపుస్వారీ, యుద్ధవిద్యల్లో శిక్షణ తీసుకున్న విషయం తెలిసిందే. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమాలో విజయ్ దేవరకొండ ఫిజికల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రత్యేకంగా నిలుస్తుందని చెబుతున్నారు. గుర్రపుస్వారీ, కత్తిసాముతో పాటు గన్ షూటింగ్‌లో (ఫైర్‌ఆర్మ్ ఆపరేషన్) ఇంటెన్స్ ట్రెయినింగ్ తీసుకున్నాడట. గుర్రపుస్వారీ చేస్తూనే బందూక్‌ను పేల్చే యాక్షన్ ఘట్టాలపై ఆయన ప్రత్యేక తర్ఫీదును తీసుకున్నాడని సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. పోరాట ఘట్టాలు అత్యంత సహజంగా కనిపించేందుకు శారీరకంగా కఠోర సాధన చేశారని, హెవీ బాడీబిల్డింగ్‌తో ఆయన లుక్స్ ప్రేక్షకుల్ని సర్‌ప్రైజ్ చేస్తాయని చెబుతున్నారు. రణబాలి పాత్ర తాలూకు శారీరక, మానసిక ఉద్వేగాల్ని ప్రతిబింబించేలా యుద్ధ వీరుడిగా ఆయన పాత్ర ప్రతీ ఒక్కరిని ఆకట్టుకుంటుందని అంటున్నారు. 1854-1878 మధ్య బ్రిటీష్ కాలంలో జరిగిన యథార్థ చారిత్రక సంఘటనల ఆధారంగా పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: అజయ్-అతుల్, నిర్మాతలు: నవీన్ యెర్నేని, రవిశంకర్, కథ, దర్శకత్వం: రాహుల్ సంకృత్యాన్.

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s SAI KRISHNA PUBLICATIONS, Owned by M/s SAI KRISHNA PUBLICATIONS, Printed at – Sree Seshasai Enterprises, Plot No.98/1, Co-operative Industrial Estate, IDA Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri District, Telangana. Published at H.No.3-5-182, Kotagally, Ushaprasad Multiplex back side, Nizambad District-503001, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2010/35558 Phone No. 9440231967